మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక

# నేడు మంథనిలో ఐటికంపెనీ ప్రారంభం



మంథని-జనత న్యూస్
పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని గోదావరిఖని రోడ్ గీట్లస్ హబ్ వద్ద కాంటిలియన్ నెట్‌వర్క్బ సాఫ్ట్‌వేర్ కంపెనీని ప్రారంభించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు ప్రకటించాయి. దీన్ని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభిస్తారని తెలిపారు. హైదరబాద్ వారి బ్రాంచ్ సాఫ్ట్ వేర్ కంపెనీ బ్రాంచ్ ను మంత్రి ప్రారంభించడం సంతోషక కరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మంథని నియోజకవర్గంలోని ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని కోరారు.

# జయ జయ శుభకర వినాయక

## ఆకట్టుకుంటున్న కుభేర లక్ష్మి గణపతి

**రూ. 35 లక్షల కొత్త నోట్లతో అలంకరణ.. భూతల స్వర్గాన్ని తలపిస్తున్న మండపం**





నభూతో న భవిష్యతి అన్నట్లుగా ఉంది ఇక్కడి గణేశ్ మండపం. భూతల స్వర్గాన్ని మరపించేలా ఆధ్మాత్మిక శోభను సంతరించుకుంది. విభిన్న రీతిలో ఎక్కడా లేని విధంగా కుభేర లక్ష్మి గణపతి రూపంలో భక్తులు దర్శనమిస్తున్నారు గన నాథుడు. ఇక్కడికి వచ్చిన భక్తులు తన్మయత్వంతో మరుపురాని అనుభూతిని పొందుతున్నారు. ఇది ఎక్కడో కాదు. కరీంనగర్ విద్యానగర్ ప్యారీస్ లేన్‌లోని గణేశ్ మండపం. వేలాదిగా భక్తులు బారులు తీరుతున్నారు. శుక్రవారం సెంటిమెంటుతో పాటు కరెన్సీ రూపంలో కనిపించే లక్ష్మి గణపతిని చూసి తరించారు.

– కరీంనగర్-జనత న్యూస్





# స్తంభించిన 'మీ-సేవ'

**మూడు రోజులుగా నిలిచి ఆన్‌లైన్ సేవలు**

**40 రకాల సేవలకు ఆటంకం**

**కేంద్రాల్లో వినియోగదారుల పడిగాపులు**

జనత న్యూస్-కరీంనగర్ ప్రతినిధి మీ-సేవ పోర్టల్ సేవలు నిలిచి పోయాయి. తెలంగాణ వ్యాప్తంగా 33 జిల్లాల్లో ఆన్‌లైన్ సేవలు నిలిచి పోవడంతో..40 రకాల సేవలు నిలిచి పోయాయి. దీంతో విద్యార్థులు, ఇతర వార్గాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాంకేతిక కారణాలతో ఆన్‌లైన్ నిలిచి పోవడంతో ఇటు

మిగతా 2 లో




# ఎఫ్ఐఆర్‌తో చర్యలుండేనా..?

**కాగ్రెస్ ప్రభుత్వ మీనమేషాల్లో ఆంతర్యం ?**


**బీఆర్ఎస్ కార్పోరేటర్, మాజీ మేయర్ ఫిర్యాదు**


**స్మార్ట్‌సిటీ నిధుల్లో అవినీతిపై సర్వత్రా చర్చ**

**జంక్షన్ల అభివృద్ధి పనులపైనా అనేక అనుమానాలు**

జనత న్యూస్-కరీంనగర్ ప్రతినిధి : కరీంనరగ్ స్మార్ట్‌సిటీ నిధుల కేటాయంపుల్లో జరిగిన అవినీతెంత..? అక్రమాలకు పాల్పడ్డది కేవలం అధికారులేనా..మేయర్ పాత్ర లేదా ? నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన పనులపై హైకోర్టు ఆదేశాలతో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోద్కెన కేసుపై విచారణ చేపడుతారా..? దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం స్తబ్దంగా ఉండడంలో ఆంతర్యమేంటి..? బీఆర్ఎస్ అదిష్టానం మద్దతుతోనే మాజీ మేయర్ సర్ధార్ రవీందర్ సింగ్ అదే పార్టీకి చెందిన మేయర్ సునిల్ రావ్కుట పోరాడుతున్నారా..? ఇలాంటి అనేక ప్రశ్నలకు సమాదానాలు రావాల్సి ఉంది. కరీంనగర్ స్మార్ట్‌సిటీ నిధుల కేటాయింపుల్లో అవక తవకలపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు

మిగతా 2 లో





# రాజకీయాల్లో.. పెను తుపాను కౌశిక్

**కౌశిక్.. ఎప్పుడు సంచలనమే..**

**రాష్ట్రరాజకీయాల్లో కేంద్ర బిందువుగా యువ ఎమ్మెల్యే**

**ప్రస్తుతం మరోసారి కౌశిక్ చుట్టూ రాజకీయాలు**

(కోరెం సుధాకర్ రెడ్డి, జనతా న్యూస్, హుజురాబాద్) హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీరు ఆది నుండి సంచలనమే.. ప్రస్తుతం మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో మరో సారి కేంద్ర బిందువుగా మారారు. కౌశిక్ రెడ్డి రాష్ట్ర రాజకీయాల్లో తెరమీదికి రావడంతో రెండు రోజులు రాష్ట్ర రాజకీయాలు అట్టుడికాయి. హైదరాబాదులో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. బిఆర్ఎస్ పార్టీ శ్రేణులను ఎక్కడికక్కడ

మిగతా 2 లో

# ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి.. అల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి శంఖారావం

కరీంనగర్-జనత న్యూస్ కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ఆరు నెలల ముందుగానే ప్రచార శంఖారావాన్ని పూరించారు అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి. కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో క్యాంపు

మిగతా 2 లో



# ఆరోగ్య సమాజంతోనే అభివృద్ధి

**పోలీసు శాఖ సేవలు అభినందనీయం**

**ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**మానాలలో ఉచిత వైద్య శిబిరం**



.. వివరాలు 2లో

# జయ జయ శుభకర వినాయక

**మొదటి పేజీ తరువాయి**

నగరంలోని విద్యానగర్ ప్యారీస్ లేన్‌లోని గణేశ్ మండపంలో ఉమాపుత్ర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం కుభేర లక్ష్మి గణపతి రూపంలో గణ నాథున్ని అలంకరించారు. మండపం మొత్తం కరెన్సీ నోట్లతో ఆకర్షనీయంగా మారింది. ఆ వీధిలోని కుటుంబ సభ్యులు సుమారు రూ. 35 లక్షల కరెన్సీ నోట్లను జమ చేసి..ఇలా మండపాన్ని అలంకరించడం విశేషం. మండపం మొత్తాన్ని నోట్లతో అలంకరించడంతో..దీన్ని చూసేందుకు తండోప తండాలుగా భక్తులు వస్తున్నారు. అర్థరాత్రి వరకు వేడుకలను తిలకించేందుకు బారులు తీరడంతో వాలంటీర్లు శ్రమ పడాల్సి వచ్చింది. ఈ నెల ఏడో తేదీ వినాయక చతుర్థి నుండి రోజుకో విధంగా విభిన్న అలంకరణలతో పాటు..ఆధ్మాతిక సందేశాలు, కార్యక్రమాలు చేపట్టి ఆకట్టుకుంటున్నారు. మహా రుద్రాభిషేకం హైలెట్‌గా నిలిచింది. నేపాల్ ఖట్మండ్ సమీప ప్రాంతంలో తీసుకొచ్చిన రుద్రాక్షలతో పశుపతి లింగం, అమర్‌నాథ్ లోని మంచు శివలింగం, నవధాన్యాలతో గణపతి ప్రతిమ తయారు చేసి ప్రత్యేక పూజలు చేశారు. మరో రోజు శ్రీ కృష్ణ లీలలు ఆకట్టుకోగా.. ఉండ్రాళ్లు, మొక్కజొన్న, తెల్ల జిల్లేడు, తమలపాకులు..ఇలా గణపతికి వివిధ నైవేద్యాలు సమర్పించి వేడుకలు నిర్వహించారు. ప్రజల్లో ఆధ్యాత్మిక, దేశభక్తి పెంపొందించడంతో పాటు, సామాజిక సమైక్యత పెంపొందేందుకు కృషి చేస్తున్నారు నిర్వాహకులు. కోట సతీష్ అధ్యక్షతన నిర్వహిస్తోన్న ఈ వినూత్న కార్యక్రమాలు చూసి నిర్వాహకులను పొగడ్తలతో ముంచెత్తుతున్నారు.













# 17న నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు

**వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించాలి**
**ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**
**జిల్లా కలెక్టర్, ఎస్పీ లతో కలసి పరిశీలన**

సిరిసిల్ల-జనత న్యూస్ : ఈ నెల 17న సిరిసిల్లలో నిర్వహించే గణేశ్ నిమజ్జనోత్సవాలు వైభవంగా నిర్వహించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల కేంద్రంలో నిమజ్జనోత్సవాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ర%ఝ%రీ, ఎస్పీ అఖిల్ మహాజన్, ఇతర అధికారులతో కలసి పరిశీలించారు. మానేరు నదీ తీరంలో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన విప్..అధికారులకు పలు సూచనలు చేశారు.







అధికారుల సూచనలను మండపాల నిర్వాహకులు, యువత, స్థానిక ప్రజాప్రతినిధులు పాటించి సహకరించాలని కోరారు. ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో చేసుకోవాలని పిలుపునిచ్చారు. పోలీస్ శాఖ నిబంధన మేరకు సౌండ్ బాక్స్‌లు పెట్టుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని, వేడుకలు విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్, సెస్, మత్స్య, పోలీస్ తదితర శాఖల ఆధ్వర్యంలో చేపట్టే ఏర్పాట్లపై చర్చించారు. కావాల్సిన క్రేన్స్, జేసీబీలు, విద్యుత్ దీపాలు, నీటి సదుపాయం కల్పించాలని కమిషనర్ ను ఆదేశించారు. అన్ని మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా నిర్ణీత సమయానికి తరలించి, సహకరించాలని కోరారు.

**మున్సిపల్ ఆద్వర్యంలో ఏర్పాట్లు**

సిరిసిల్ల మున్సిపల్ ఆద్వర్యంలో నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. సిరిసిల్ల మానేరు తీరంలో బారికేడ్లు, టెంట్లు, నీటి వసతి, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్, క్రేన్లు నిర్వహణకు మొత్తం 62 మందిని, 10 మంది ఈతగాళ్లను నియమించారు. పర్యవేక్షణకు ఒక ప్రత్యేక అధికారి నియమించారు. అలాగే సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు, చంద్రంపేట, ముష్టిపల్లి, చిన్న, పెద్ద బోనాల, పెద్దూర్, సర్దాపూర్‌లో అధికారులు సమన్వయంతో నిమజ్జన విధులు నిర్వహిస్తారు.

**జిల్లాలో 2200 విగ్రహాలు..**

జిల్లాలో మొత్తం 2200 వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 400, వేములవాడ పట్టణంలో 300, ఆయా మండలాల్లోని గ్రామాల్లో మొత్తం దాదాపు 2200 ఏర్పాటు చేసినట్లు వెల్లడిరచారు. మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా నిర్ణీత సమయానికి విగ్రహాలను నిమజ్జనానికి తరలించాలని, వేడుకలు విజయవంతంగా ముగిసేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా, ఆర్డీవో రమేష్, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్, తహసిల్దార్ ఎండీ షరీఫ్ మొహియొద్దీన్ ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్తంభించిన ‘ మీ-సేవ’

**మొదటి పేజీ తరువాయి**

వినియోగ దారులు తిప్పలు పడుతుండగా, రాష్ట్ర ప్రభుత్వ ఆధాయం కూడా తగ్గింది. ఎప్పుడు పున:రుద్దరిస్తారో తెలియని పరిస్థితుల్లో వినియోగదారులు సెంటర్ల వద్ద పడిగాపులు గాస్తున్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో సుమారు 550 కేంద్రాల్లో సేవలు నిలిచి పోవడంతో ప్రవేశాల కోసం రెవెన్యూ సర్టిఫికెట్లు పొందలేక పోతున్నారు.

బర్త్, డెత్, క్యాస్ట్, ఇన్‌కం, లోకల్ సర్టిఫికెట్స్..ఇలా ఏది కావాలన్నా మీ సేవ కేంద్రాన్ని సంప్రదించాల్సిందే. ఆయా దృవీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా..తిరిగి సర్టిఫికెట్ తీసుకోవాలన్నా..ఈ సెంటర్లే దిక్కు. అలాంటి మీ%-%సేవ సెంటర్స్ పని చేయకుంటే, అదికూడా మూడు రోజులుగా సేవలు స్తంభిస్తే..ఎలాంటి ఇబ్బందులు తలెత్తు తాయో చెప్పాల్సిన అవసరం లేదు. నియామకాలు, విద్యా సంస్థల్లో ప్రవేశాలు, కౌన్సిలింగ్..ఇలా ఆయా అవసరాలకు అతిముఖ్యమైన సర్టిఫికెట్లు పొందలేక పోతున్నారు విద్యార్థులు, వినియోగ దారులు. దీంతో తమ కెరీర్ నాశనం అవుతుందనే అందోళన వ్యక్తం చేస్తున్నారు పలువురు విద్యార్థులు.

**మూడు రోజులుగా నిలిచిన సేవలు**

ఈ నెల 11 నుండి మీ సేవ కార్యకలాపాలు నిలిచి పోయాయి. శుక్రవారంతో మూడు రోజులు గడుస్తున్నా ఆన్‌లైన్ సేవలు పునరుద్దరించలేదు. దీంతో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని సుమారు 550 సెంటర్లలో వినియోగ దారులు పడిగాపులు గాస్తున్నారు. ప్రధానంగా కరీంనగర్ జిల్లాలోని సుమారు 169 సెంటర్లలో వినియోగ దారులు ఆన్‌లైన్ సేవల కోసం ఎదురు చూస్తున్నారు. ముటేషన్, ఈసీ, ఇతర సర్టిఫికెట్ల కోసం, వివిధ పన్నుల చెల్లింపులు..ఇలా మీ%-%సేవ కేంద్రాల్లో ఆయా పనులు నిలిచి పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. భూ సంబంధిత రికార్డులు, ఇతర సేవలు పొందేందుకు వెళ్తున్న వినియోగ దారుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. ఈ పరిస్థితుల్లో వినియోగ దారులకు ఏం చెప్పాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు ఆయా సెంటర్ల నిర్వాహకులు. పలు సార్లు డాటా ఎంట్రీ చేసినా ఎర్రర్ చూపించడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు నిర్వాహకులు. ఇటీవల కురిసిన వరదల కారణంగా ఈ సమస్య తలెత్తిందా..లేక సాఫ్ట్‌వేర్‌లో లోపం ఏర్పడిరదా అనేది తెలియడం లేదని సంబంధిత విభాగం అధికారులు చెబుతున్నారు. సాఫ్ట్ వేర్ సమస్య తలెత్తి ఉండదని, నెట్‌వర్క్ సమస్యను గుర్తించడంలో ఆలస్యం అవుతున్నట్లు పలువురు సాంకేతిక నిపుణులు భావిస్తున్నారు.

**త్వరలో ఆన్‌లైన్ సేవల పున:రుద్దరణ**

మీ-సేవ ఆన్‌లైన్ సేవలు నిలిపోయిన మాట వస్తవమే. పునరుద్దరణకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ సమస్య రాష్ట్ర వ్యాప్తంగా నెలకొంది. ఆయా ప్రాంతాల నుండి ఫిర్యాదులు వస్తున్నాయి. పై అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. త్వరలో పరిష్కారం అవుతుందని ఆశిస్తున్నాం.

- శ్రీనివాస్ రెడ్డి జిల్లా కో ఆర్డినేటర్, మీ-సేవ

# ఆరోగ్య సమాజంతోనే అభివృద్ధి

**మొదటి పేజీ తరువాయి**


రుద్రంగి-జనత న్యూస్ : శాంతి భద్రతలతో పాటు సామాజిక కార్యక్రమాలు చేపట్టడ దం అభినంద నీయమని సిరిసిల్ల జిల్లా పోలీస్ సేవలను కొనియాడారు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాలలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఆరోగ్య శాఖ, అశ్విని హాస్పిటల్ ,రెనే హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, కో%-%ఆపరేటీవ్ సొసైటీ యూనియన్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి లతో కలసి ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఇందులో సుమారు 800 మంది రోగులు వైద్య సేవలు పొందారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ..మూరుమూల ప్రాంతాల్లో సైతం తామున్నామని జిల్లా యంత్రాంగం ముందుకొచ్చి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. పోలీసు శాఖ ద్వారా శాంతి భద్రతలతో పాటు సామాజిక సేవలు చేస్తున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో రుద్రంగి మండల ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఉచిత వైద్యం , విద్య అనే లక్ష్యంతో తమ ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. జిల్లాలో అన్ని గ్రామాల్లో మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేసి వైద్య సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ వసంతరావు, ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, వేములవాడ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య, సీఐలు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి..
# అల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి శంఖారావం

**మొదటి పేజీ తరువాయి**

కార్యాలయాన్ని ప్రారంభించారు. వేద మంత్రాల మధ్య అర్చకుల ఆశీర్వచనాలు అందుకుని, విద్యాసంస్థల యాజమాన్యాలు, అభిమానులు, శ్రేయోభిలాషుల నడుమ తల్లిదండ్రులచే రిబ్బన్ కటింగ్ చేయించారు నరేందర్ రెడ్డి. పట్టభద్రుల సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అధిక మెజారిటీతో తను గెలిపిస్తారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. గత కొద్ది రోజులుగా పలు విద్యా సంస్థలను సందర్శిస్తూ వచ్చిన నరేందర్ రెడ్డి..ఆయా ప్రాంతాల్లోని పట్టభద్రులను మద్దతు కోరుతూ ఆకట్టుకుంటున్నారు. అటు ప్రభుత్వ, ఇటు ప్రయివేటు విద్యా సంస్థలను ఆయన సందర్శిస్తున్నారు. విద్యార్థి సంఘాల కార్యక్రమాల్లోనూ విరివిగా పాల్గొంటున్నారు. పార్టీ నుండి టికెట్ రాకున్నప్పటికీ, పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో నిలుస్తాననే సంకేతాలిచ్చారు.

# స్కాలర్‌షిప్ పరీక్షలో సత్తా చాటిన శ్రీకర్‌రెడ్డి




కరీంనగర్-జనత న్యూస్ : నగరంలోని అక్షర ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఐదవ తరగతి చదువుతున్న ఎర్రం శ్రీకర్ రెడ్డి స్కాలర్‌షిప్ పరీక్షలో ప్రతిభ చూపాడు. ఇందులో మెరిట్ సాధించిన శ్రీకర్‌రెడ్డి.. 50% ఫీజు రాయితీకి అర్హత పొందాడు. అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో అక్షర ఇంటర్నేషనల్ స్కూల్స్ యాజమాన్యం మేధా సంపత్తిని వెలికి తీయడంలో కొత్త ఒరవడి ని సృష్టిస్తోందని నిర్వాహకులు తెలిపారు. ప్రిన్సిపాల్ విజయ భారతి మాట్లాడుతూ విద్యార్థుల మనో వికాసానికి తోడ్పడుతున్న ఛైర్మన్ జగన్మోహన్ రావుకు, యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మేనేజ్‌మెంట్స్ ఇస్తున్న అవకాశాలను తల్లిదండ్రులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థి శ్రీకర్ రెడ్డి, అతని తల్లిదండ్రులను అభినందిస్తూ సత్కరించారు.

మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక

# అరికెపూడి బిఆర్ఎస్ లో ఉన్నట్టా.. కాంగ్రెస్ లో చేరినట్టా స్పష్టం చేయాలి..?

**రేవంత్ రెడ్డి రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ ప్లే చేస్తున్నారు**

**నిర్బంధాలు, ఆంక్షలు, అరెస్టులు బిఆర్ఎస్ కు కొత్త కాదు**

**దమ్ముంటే అరికెపూడి.. గులాబీ కండువా వేసుకొని, కెసిఆర్ ఫోటో పెట్టుకొని మాట్లాడాలని హితవు**

**ఏకపక్షంగా డీజీపీ వార్నింగ్ హాస్యాస్పదం**

**హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ఒడితేల సతీష్ కుమార్ ధ్వజం**



హనుమకొండ, జనతా న్యూస్ : శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ బిఆర్ఎస్ లో ఉన్నట్టా.. కాంగ్రెస్ పార్టీలో చేరినట్టా స్పష్టం చేయాలని, ప్రెస్ మీట్ లో నీళ్లు నములుతూ, స్పష్టత లేకుండా మాట్లాడుతున్న అరికెపూడి కి దమ్ముంటే గులాబీ కండువా వేసుకొని, బీఆర్ఎస్ అధినేత కెసిఆర్ ఫోటో తన పక్కన పెట్టుకుని మాట్లాడాల్సి ఉండేనని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితేల సతీష్ కుమార్ సవాల్ విసిరారు. శుక్రవారం మీడియా సమావేశంలో సతీష్ కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రశ్నించిన ప్రతిసారి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఏదో ఒక హైడ్రామాకు తెరలిపి డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడుతున్నారని ఆరోపించారు. విపక్ష పార్టీ ఎమ్మెల్యే పై దాడి చేయించిన సీఎం, నేడు శాంతి భద్రతల పేరెత్తడం విడ్డూరంగా ఉందన్నారు. రుణ మాఫీ పై, వరదలపై ప్రశ్నిస్తే ప్రజల దృష్టిని మరల్చేందుకు సరికొత్త నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ప్రజా పాలన ప్రభుత్వంలో ప్రతిపక్షాలకు మీటింగ్ పెట్టుకునే హక్కు లేదా అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ నేతలు అంటే ముఖ్యమంత్రికి ఎందుకు అంత వణుకు అని, రాష్ట్రవ్యాప్తంగా బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ హౌస్ అరెస్టు చేయడం, అదుపులోకి తీసుకోవడం సిగ్గుచేటు అన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటూ ఆనాటి ఎమర్జెన్సీ రోజులను రేవంత్ అమలు చేస్తున్నారని మండిపడ్డారు. కౌశిక్ రెడ్డి నివాసం పై దాడి చేసిన అరికెపూడి గాంధీ అనుచరులను, కాంగ్రెస్ గుండాలను కేసులు నమోదు చేసి చేతులు దులుపుకోవడం కాదు అరెస్టు చేయాలని దుయ్యబట్టారు. విద్వేషాలను రెచ్చగొట్టవద్దని రాష్ట్ర డిజిపి ఏకపక్షంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులకు చెప్పడం చూస్తుంటే ఎమర్జెన్సీని తలపించేలా కనిపిస్తోందన్నారు. డీజీపీ ఏకపక్షంగా మాట్లాడినట్టు కనిపించిందన్నారు. దాడికి పాల్పడింది కాంగ్రెస్ పార్టీ నాయకులు అరికెపూడి గాంధీ అనుచరులైతే, వార్నింగ్ మాత్రం బిఆర్ఎస్ నేతలకు ఇస్తారా.. ఇది హాస్యాస్పదంగా ఉందన్నారు. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ తీరును రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే విపక్ష ప్రజాప్రతినిధులపై దాడులకు తెగబడుతున్నారని, తెలంగాణ ఇమేజ్ ను డ్యామేజ్ చేసేలా ప్రవర్తిస్తామంటే బిఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోబోదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## శాంతియుత వాతావరణంలో నిమజ్జనం

**వేములవాడ రూరల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్**




వేములవాడ-జనత న్యూస్ : శాంతియుత వాతావరణంలో వినాయక నిమజ్జనాన్ని నిర్వహించాలని వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ నిర్వాహకులను కోరారు. సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో వినాయక మండపాల నిర్వాహకులతో రూరల్ ఎస్ ఐ మారుతీ ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించగా, వేములవాడ రూరల్ తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో శ్రీనివాస్, ఫైర్ ఆఫీసర్ అనిల్ కుమార్ ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. మండలంలోని16 గ్రామాల్లో మొత్తం 96 వినాయక మండపాలు ఆన్లైన్లో నమోదు అయ్యాయని,ఆయా వినాయకులను జియో ట్యాగింగ్ చేసి ప్రతిరోజు బ్లూ కోల్ట్స్ , పెట్రో కార్ సిబ్బంది పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. ఈ నెల 15 16 తేదీలలో నిమజ్జనాలు చేస్తారని, చెరువులో నిమజ్జనం చేసేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వినాయక నిమజ్జన సమయంలో మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు దూరంగా ఉండాలని, పెద్ద పెద్ద వినాయకులు ఉన్నవారు ముందు రోజే రూట్ ను చూసుకొని ఆ రూట్ ప్రకారమే వెళ్లాలని, వినాయక శోభాయాత్రకు ఎలాంటి ఆటంకం కలిగినా వెంటనే డయల్ 100 కు ఫోన్ చేయాలని ఆయన తెలిపారు. వినాయక మండపాల వద్ద మద్యం సేవించి ఆగడాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ సి ఐ తెలిపారు.

## ప్రజాపాలనలో అక్రమ అరెస్టులు!

**బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాకాల మహిపాల్ రెడ్డి.**



జనతన్యూస్ బెజ్జంకి : హుజురాబాద్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై జరిగిన దాడికి నిరసన తెలుపుట కోసం పార్టీ అధిష్టానం పిలుపుమేరకు హైదరాబాద్ బయలుదేరిన బెజ్జంకి మండలం పార్టీ కార్యకర్తలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ బెజ్జంకి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పాకాల మహిపాల్ రెడ్డి శుక్రవారంపత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన అని చెప్పుకునే!! కాంగ్రెస్ పార్టీ ఇలా అక్రమ అరెస్టులు ఏంటని, ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన చేసే హక్కు ప్రతిపక్ష పార్టీలకు ఉంటుందని, ఇలా అక్రమ అరెస్టులతో ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అరెస్ట్ అయిన వారిలో నాయకులు లింగాల లక్ష్మణ్, కచ్చు రాజయ్య, హనుమండ్ల లక్ష్మారెడ్డి,రావుల మండయ్య,ముక్కిస రాజిరెడ్డి, వంగల నరేష్ తదితరులు ఉన్నారు.

## పదోన్నతి పొందిన రాజన్న ఆలయ ఉద్యోగులు



వేములవాడ, జనతా న్యూస్: రాజన్న ఆలయంలో రికార్డ్ అసిస్టెంట్ లు గా విధులు నిర్వహిస్తున్న నరాల రాజు, పోల్సాని రాజు ,రాకేష్ , గుడిపల్లి రమణ,మేకల వెంకటేష్ ,కనకదుర్గ లకు జూనియర్ అసిస్టెంట్ గా ఈ రోజు ఆలయ ఈఓ కె.వినోద్ రెడ్డి చేతుల మీదుగా పదోన్నతి ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏ ఈ ఓ లు శ్రవణ్ ,శ్రీనివాస్ లతో పాటుగా ,పర్యవేక్షకులు పూజిత , కూరగాయల శ్రీనివాస్, పురాణంవంశీ ఉన్నారు

# రాజకీయాల్లో.. పెను తుపాను కౌశిక్



**మొదటి పేజీ తరువాయి**

అరెస్టు చేశారు. సై అంటే సై అన్నట్టుగా కౌశిక్ వ్యవహరించారు. కౌశిక్ ఎంట్రీతో కాంగ్రెస్ బి ఆర్ ఎస్ ల మధ్య యుద్ధ వాతావరణం సృష్టించబడింది.

**కౌశిక్ నైజమే అది..**

క్రికెటర్ గా రాజకీయ ఆరంగేట్రం చేసి హుజురాబాద్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసి కౌశిక్ ఓటమి చెందారు. ఆనాడు కౌశిక్ మద్దతుగా జమ్మికుంటలో రేవంత్ రెడ్డి బహిరంగ సభ జరగడం గమనార్హం. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దగ్గరి బంధువుగా.. వీణవంక మండల కేంద్రానికి చెందిన కౌశిక్.. అనతి కాలంలోనే హుజురాబాద్ రాజకీయాలతో పాటు రాష్ట్ర రాజకీయాలను ఆకర్షించారు.

**ఈటల నిష్క్రమణతో**

బిఆర్ఎస్ పార్టీకి 2020 వరకు స్థానికంగా ప్రతినిత్యం వహించిన ఈటెల రాజేందర్ ఆ పార్టీని వీడి బిజెపిలో చేరిపోవడంతో కౌశిక్ హస్తం గూటి నుండి గులాబీ గూటికి చేరారు. ఆనాడు వచ్చిన ఉప ఎన్నికల్లో కీలక భూమిక పోషించారు. అనతి కాలంలోనే కెసిఆర్, కేటీఆర్, హరీష్ రావు లకు దగ్గరయ్యాడు. హుజురాబాద్ ఉప ఎన్నిక తనంతరం కౌశిక్ పార్టీ అధిష్టానం ఎమ్మెల్సీగా అవకాశం కల్పించింది. తాను ఎమ్మెల్సీగా సంతృప్తిగా లేనని, ప్రజల ఓట్లతో గెలవాలన్నదే తన సంకల్పమని బహిరంగంగానే ఆయన ప్రకటించారు. అనుకున్నట్టుగానే ఈతల రాజేందర్ ను ఓడించి హుజురాబాద్ లో గులాబీ జెండా ఎగరేశారు. సహజంగానే దూకుడు స్వభావం కలిగిన కౌశిక్.. ప్రతి సందర్భంలోనూ తన ప్రత్యేకతను చాటుకుంటూ వస్తున్నారు. ఆయన తీసుకున్న నిర్ణయాలు ఆయన వ్యవహార శైలి తరచుగా వివాదాస్పదమవుతున్నప్పటికీ ఆయన ఎక్కడ తాను తగ్గేదేలే అన్నట్టుగా వ్యవహరిస్తారు.

**ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ.. అదే దూకుడు..**

అధికారంలో ఉన్నప్పుడు హుజురాబాద్ నియోజకవర్గంలో అన్ని తానై కౌశిక్ నడిపించారు. బిఆర్ఎస్ పార్టీ అధికారాన్ని కోల్పోయినప్పటికీ.. హుజురాబాద్ లో మాత్రం కౌశిక్ ఎక్కడ తగ్గడం లేదు. ఇక్కడ కళ్యాణ లక్ష్మి చెక్కులను అధికార పార్టీ నేతలే ఇవ్వాలని చూస్తే కొట్టుకు వెళ్లారు. కోర్టు ఎమ్మెల్యే చేతుల మీదుగానే చెక్కులు ఇవ్వాలంటూ తీర్పు ఇచ్చింది. దీంతో వ్యతిరేని పరిస్థితిలో అధికారులు కౌశిక్ చేతుల మీదుగానే చెక్కులు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ వ్యవహారంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఎమ్మార్వో తో మాట్లాడిన ఫోన్ రికార్డింగ్ని కూడా కౌశిక్ బయట పెట్టారు. ప్రజాక్షేత్రంలో తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ లపై తరచుగా విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు.

**తాజాగా పార్టీ మారిన ఎమ్మెల్యేలను టార్గెట్ చేసిన కౌశిక్**

తాజాగా పార్టీ మారిన ఎమ్మెల్యేలను కౌశిక్ టార్గెట్ చేశారు. ఇటీవల హైకోర్టు ఈ విషయమై నాలుగు వారాల్లో స్పీకర్ కార్యాలయం చర్యలు తీసుకోవాలంటూ ఆదేశాలు ఇచ్చింది. ఇదే అదనుగా కౌశిక్ తన గళాన్ని లేవనెత్తారు. హైదరాబాదులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలకు సిగ్గు లజ్జ లేదంటూ తీవ్ర విమర్శలు చేశారు. అనర్హత వేటు ఖాయమని పది నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రాబోతున్నాయి అంటూ సంచలన ప్రకటనలు చేశారు. ఈ లోపు అసెంబ్లీలో బీఎసీ కమిటీ చైర్మన్ నియామకం రావడం మరింత వివాదమైంది. శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి బి ఏ సి చైర్మన్గా కాంగ్రెస్ నియమించడంతో కౌశిక్ గాంధీని టార్గెట్ చేశారు. ఈలోపు గాంధీ తాను బిఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానంటూ చెప్పడంతో.. వివాదం మొదలైంది. తన గాంధీ ఇంటికి వెళ్లి కండువా కప్పుతానని ఆయన ఇంటిపై జెండా ఎగరవేస్తానంటూ కౌశిక్ ప్రకటించారు. దీంతో పోలీసులు కౌశిక్ ఇంటి వద్ద బందోబస్తు ఏర్పాటు చేయడం ఆయనను అడ్డుకోవడం, తిరిగి నేనే వస్తున్న అంటూ గాంధీ ప్రకటించడం కౌశిక్ ఇంటిపై దాడి జరగడం జరిగాయి. ఈ సంఘటనతో రాష్ట్రంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. కౌశిక్ ఇంటిపై దాడి రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించింది. మాజీ మంత్రులు హరీష్ రావు గంగుల కమలాకర్ ప్రశాంత్ రెడ్డి సబితా ఇంద్రారెడ్డి తదితరులు కౌశిక్ రెడ్డికి సంఘీభావం ప్రకటించారు. ఆందోళనకు దిగిన వారిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రభుత్వంపై విమర్శల వర్షం కురిపించారు. కాగా శుక్రవారం కూడా హైదరాబాదులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గాంధీ ఇంటి వద్ద బి ఆర్ ఎస్ పార్టీ సమావేశం నిర్వహిస్తున్నట్టుగా ప్రకటించడంతో ఉద్రిక్తత నెలకొంది. కౌశిక్ రెడ్డి తో పాటు ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు తదితరులను పోలీసులు ఎక్కడికక్కడ గృహనిర్బంధం చేశారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా బీ అర్ ఎస్ నాయకులను గృహనిర్బంధం చేశారు. అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో పెట్టారు. ఇలా మీడియాలో సోషల్ మీడియాలో రాష్ట్ర రాజకీయాల్లో రెండు రోజులపాటు కౌశిక్ వ్యవహారమే హాట్ టాపిక్ గా నడిచింది. మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో కౌశిక్ రెడ్డి కేంద్ర బిందువు కావడం స్థానిక రాజకీయ వర్గాల్లో, ప్రజల్లో చర్చనీయాంశమైంది.

# ఎఫ్ఐఆర్‌తో చర్యలుండేనా..?




**మొదటి పేజీ తరువాయి**

కావడం రాష్ట్ర వ్యాప్తంగా సంఛలనం రేపింది. బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మేయర్ సర్ధార్ రవీందర్ సింగ్ అదే పార్టీకి చెందిన మేయర్ సునిల్ రావుపై అనేక ఆరోపనలు చేయడం, అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయించడం సర్వత్రా చర్చకు దారి తీసింది. ఇది అటు బీఆర్ఎస్‌లో..ఇటు కాంగ్రెస్ పార్టీ క్యాడర్‌లో దూమారం రేపుతోంది. మున్సిపల్ ఎన్నికలకు కొద్ది కాలం ముందు స్మార్ట్‌సిటీ అక్రమాలు, అవినీతి ఆరోపనలు, కేసు నమోదు కావడం..ఎటు వైపు దారి తీస్తుందోనని పలువరు భావిస్తున్నారు.

**ఎఫ్ఐఆర్ నమోదు ఇలా..**

నిబంధనలకు విరుద్దంగా స్మార్ట్‌సిటీ నిధులను పంచాయతీ పరిధిలోని అభివృద్ధి పనులకు కేటాయించారని, ఇందులో భారీగా అవినీతి జరిగిందని మాజీ మేయర్, మున్సిపల్ కార్పోరేటర్ సర్ధార్ రవీందర్ సింగ్ ఆరోపన. దీనిపై జూల్కె 3న వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు పట్టించుకోక పోవడంతో హైకోర్టును ఆశ్రయించారు రవీందర్ సింగ్. న్యాయ సూత్రాలు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21 లను ఉల్లంఘించారని కోర్టుకు వివరించడంతో క్రిమినల్ కేసుకు ఆదేశించింది న్యాయ స్థానం. దీంతో కరీంనగర్ వన్ టౌన్ పోలీసులు క్రైం నంబర్ 480/2024 సెక్షన్ 420, 406 ప్రకారం కేసు నమోదు చేశారు. ఇందులో స్మార్ట్ సిటీ మేనేజింగ్ డ్కెరక్టర్ గా విధులు నిర్వహిస్తున్న కరీంనగర్ మునిసిపల్ కమిషనర్, ప్రాజెక్టు ఎస్ఈ , మేనేజ్ మెంట్ కన్సల్టెన్సీ మేనిజింగ్ డ్కెరక్టర్‌పై ఎఫ్ఐఆర్ నమోద్కెంది.

**ఎఫ్ఐఆర్‌కు దారి తీసిన అంశాలు..**

2017%-%18 సంవత్సరంలో కరీంనగర్ స్మార్ట్‌సిటీకి ఎంపిక కాగా..ఇందుకు సిబంధించిన మార్గదర్శకాలు జారీ అయ్యాయి. రూ.1878 నిధుల్లో రిట్రో ఫిటింగ్, కాంటిజెన్సీ, ప్యాన్‌సిటీ..తదితర పనులు చేపట్టాల్సి ఉంది. అప్పటి 50 డివిజన్లలోని 31 డివిజన్లలో 23.85 కిలోమీటర్ల పరిధిలో నిర్ధేశించిన డివిజన్లలో మాత్రమే ఈ పనులు చేపట్టాల్సి ఉంది. కాని..ఇందుకు విరుద్దంగా బొమ్మకల్ పంచాయతీ పరిధిలో రూ. రెండు కోట్లతో జంక్షన్ అభివృద్ధి పనులు చేపట్టారు. దీంతో పాటు రేకుర్తి తదితర ప్రాంతాల్లో కూడా స్మార్ట్‌సిటీ నిధులతో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారని మాజీ మేయర్ రవీందర్ సింగ్ అనేక సార్లు ఆరోపించారు. ఫిర్యాదులు కూడా చేశారు. చివరకు కోర్టు మెట్లెక్కారు.

**కూడళ్ల అభివృద్ధి పనులపై విచారణ ?**

నగరంలోని తెలంగాణ చౌరస్తా, కమాన్, కోర్టు చౌరస్తా, బద్దం ఎల్లారెడ్డి చౌరస్తా, నాకా చౌరస్తా, వన్‌టౌన్ చౌరస్తా..అభివృద్ధి పనుల్లో భారీ అవక తవకలు జరిగినట్లు ఆరోపనలున్నాయి. ఒక్కొక్క చౌరస్తాకు పలు మార్లు నిధులు కేటాయించి అభివృద్ధి పనుల చేపట్టడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఇందులో కూడా భారీగా అవినీతి జరిగిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఒక సందర్భంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా అనుమానాలు వ్యక్తం చేశారు. దీంతో పాటు నిబంధనలకు విరుద్దంగా కోవిడ్ సమయంలో రోడ్డు నిర్మాణం పనులు నాసిరకంగా చేపట్టి బిల్లులు పొందారని, మాజీ మేయర్ రవీందర్ సింగ్ గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వీటిపై కూడా సమగ్ర విచారణ చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

**విచారణపై కాంగ్రెస్ ప్రభుత్వ స్టాండ్ ?**

బీఆర్ఎస్ మాజీ మేయర్ ఫిర్యాదుతో ఎఫ్ఐఆర్ నమోదు కాగా..దీనిపై చేపట్టే విచారణపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కొద్ది కాలంలో మున్సిపల్ ఎన్నికలు కూడా రానున్నాయి.

ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకునే చర్యలపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఇప్పటికే రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌పై మేయర్ సునిల్ రావు తీవ్ర ఆరోపనలు చేస్తూ వస్తున్నారు. కాంగ్రెస్ నేతలు కూడా కౌంటర్ ఇస్తున్నప్పటికీ..కార్యాచరణలో చూపడం లేదనే అనుమానాలున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో స్మార్ట్‌సిటీ నిధులపై నమోద్కెన ఎఫ్ఐఆర్‌పై సమగ్ర విచారణ చేపడుతుందా..? లేక స్తబ్ధంగా ఉంటుందా..? అనేది తేలాల్సి ఉంది.

## విప్లవానికి నిలువెత్తు నిదర్శనం ఏచూరి

**మండల సిపిఎం, సిపిఐ నాయకులు.**



జనత న్యూస్ బెజ్జంకి : సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి ఇటీవల మరణించగా శుక్రవారం బెజ్జంకి మండల కేంద్రంలో మండల సిపిఎం, సిపిఐ నాయకులు అంబేద్కర్ కూడలిలో కొవ్వొత్తులతో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏచూరి గొప్ప విప్లవ కెరటం అని,ఆయన మరణం దేశ ప్రజలకు తీరని లోటు అని గొప్ప ఆర్థిక , రాజకీయవేత్తను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తిప్పారం శ్రీనివాస్, సిపిఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్, మండల సిపిఎం నాయకులు బొమ్మిడి సాయి కృష్ణ, బోనగిరి లింగం, సంగ ఎల్లయ్య, సిపిఐ నాయకులు సంగెం మధు, దొంతలేని మహేష్, స్వేరోస్ నాయకులు ఉప్పులేటి బాబు, స్థానికులు బోనగిరి అర్జున్, లింగాల బాబు, కల్లూరు శ్రీను, బండిపెల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సెంటిమెంట్‌తో.. అరాచకానికి గులాబీ నేతల యత్నం

**మహిళలను అవమానిస్తే నోరుమెదపరా?**

**మహిళలకు, ఆంధ్రసెటిలర్స్ కి క్షమాపణ చెప్పాలి**

**కౌశిక్ ను కట్టడి చేయకుంటే ప్రజాగ్రహమే**



కరీంనగర్-జనత న్యూస్: తెలంగాణ సెంటిమెంట్ ను రాజేసి అరాచకం సృష్టించేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ విమర్శించారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, అరికెపూడి గాంధీ మధ్య చోటుచేసుకున్న వివాదమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. పదేళ్లుగా ఆంధ్రా-తెలంగాణ ప్రజల మధ్య ఎలాంటి గొడవలు లేవని, ప్రశాంతంగా కలిసి మెలిసి జీవనం సాగిస్తున్న తరుణంలో ఇప్పుడు బీఆర్ఎస్ నాయకులను ఇరుప్రాంతాల మధ్య వైషమ్యాలు సృష్టిస్తున్నారని ఆయన విమర్శించారు. తెలంగాణలో మళ్లీ వైషమ్యాలు సృష్టించేం దుకు కౌశిక్ రెడ్డిని బీఆర్ఎస్ అధిష్టానం పావుగా వాడుకుం టున్నదని, మహిళలను కించపర్చేలా మాట్లాడుతున్నా, అరాచకాలకు పాల్పడుతున్నా కౌశిక్ రెడ్డిపై ఆ పార్టీ అధిష్టానం ఏమాత్రపు చర్యలు కూడా తీసుకోకపోవ డం అనుమానాలకు తావిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు చీర, గాజులు పంపుతానంటూ కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికీ మహిళలను అవమానించినట్టేనని ఆయన పేర్కొన్నారు. కౌశిక్ కు నోటి దూల ఎక్కువని, మహిళలను అవమానించడం పాడికి పరిపాటిగా మారిందని ఆయన విమర్శించారు. గతంలోనూ మాజీ గవర్నర్ ను కూడా కించపర్చేలా మాట్లాడారని డాక్టర్ కవ్వం పల్లి గుర్తు చేశారు. కౌశిక్ రెడ్డి అరాచకవాదిగా మారిపోయా దని, ఆయన ఆగడాలు రోజురోజుకు పెచ్చుమీరి పోతున్నా కేసీఆర్ కుటుంబం గాని, గులాబీ నాయకులు ఎందుకు కట్టడి చేయలేకపో తున్నారని ఆయన ప్రశ్నించారు. అసెంబ్లీలో సబితా ఇంద్రారెడ్డిపై సీఎం చేసిన వ్యాఖ్యకు అనర్థవంతమైన రగడ చేసిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఎందుకు మాట్లాడటం లేదని ఆయన నిలదీశారు. ముఖ్యంగా మహిళలను అవమానపర్చేలా కౌశిక్ రెడ్డి చేస్తున్న అభ్యంతరకర వ్యాఖ్యలపై కల్వకుంట్ల కవిత ఎందుకు స్పందించడం లేదని, ఆమె మౌనం వెనుక అంతరార్థ మేమిటని డాక్టర్ కవ్వంపల్లి ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇప్పటికైనా గులాబీ నేతలు ఆత్మ పరిశీలన చేసుకోవాలని, అదే విధంగా కౌశిక్ ను కట్టడి చేయకుంటే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని డాక్టర్ కవ్వంపల్లి హెచ్చరించారు.

## పదిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

జగిత్యాల,జనత న్యూస్: పదిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ సూచించారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ మీటింగ్ హాల్లో కలెక్టర్ జిల్లా విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మండల విద్యాధికారులకు,నోడల్ అధికారులకు,ౌంసిడెన్షియల్ పాఠశాల కోఆర్డినేటర్లకు,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో 2025 మార్చిలో నిర్వహించనున్న పదవ తరగతి పరీక్షల సన్నహాక సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే పది పరీక్షల్లో విద్యార్థులు నూరు ఉత్తీర్ణత సాధించేందుకు కావలసిన కార్యచరణ ప్రణాళికను రూపొందించి ఉపాధ్యాయులు,ప్రధానోపాధ్యాయులు,ఎంఈఓలు అందరూ కృషి చేయాలని కోరారు.పాఠశాలలో పదవ తరగతి లో చదువులో వెనుకబడిన విద్యార్థులు అందరిని గుర్తించి రాబోయే ఏడు నెలలు వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి నూరు ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాద్యాయులు కృషి చేయాలని సూచించారు. జిల్లా విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల యొక్క చదవడం రాయడంపై ఉపాధ్యాయులు శ్రద్ధ వహించి రాబోయే పదవ తరగతి పరీక్షల్లో నూరుశాతం గుణాత్మక ఫలితాలు వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు.ఈ సమావేశంలో క్వాలిటీ కోఆర్డినేటర్ కొక్కుల రాజేష్,మండల విద్యాధికారులు,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు,పాఠశాల రీజనల్ కోఆర్డినేటర్స్ పాల్గొన్నారు.

# ప్రజాపాలన దినోత్సవానికి ఏర్పాట్లు

## గ్యారంటీ పథకాల అమలుపై స్టాల్స్ ఏర్పాటు చేయాలి
## వరద సహాయక చర్యల్లో అధికారుల సేవలు ప్రశంసనీయం
## జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్




ఖమ్మం-జనత న్యూస్ : సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా, పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలన దినోత్సవం నిర్వహణపై జిల్లా ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు శ్రీజ, మధుసూదన్ నాయక్ లతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17న ఉదయం 10 గంటలకు ఖమ్మం పరేడ్ గ్రౌండ్ లో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం వేడుకలు జరుగుతాయని, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. తొలుత గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకావిష్కరణ చేసి, తమ సందేశాన్ని అందజేస్తారని, అనంతరం స్టాల్స్ సందర్శన ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అభయ హస్తం గ్యారెంటీ పథకాల అమలుకు సంబంధించి స్టాల్స్ ఏర్పాటు చేయాలని, దీనికి సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తిచేయాలని కలెక్టర్ తెలిపారు.

పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించే తెలంగాణ ప్రజా పాలన దినోత్సవానికి జిల్లా అధికారులంతా తప్పనిసరిగా హాజరుకావాలని, అదేవిధంగా ప్రతి జిల్లా అధికారి కార్యాలయం, గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్యాలయాల్లో జాతీయ పతాకావిష్కరణ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

**వరద సహాయక చర్యలు అభినందనీయం**

ఎన్నడూ లేని విధంగా జిల్లాలో భారీ స్థాయిలో వరదలు వచ్చినప్పటికీ ఖమ్మం జిల్లా అధికారులు, సిబ్బంది ప్రజలకు సేవలు అందించడంలో చేసిన కృషి ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. సెప్టెంబర్ 1 నుంచి 5 వరకు జిల్లా అధికారులు, సిబ్బంది విశేష సేవలు అందించారని.. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. వరద వల్ల నష్టపోయిన వారిని గుర్తించి వారికి అవసరమైన సహాయ, సహకారాలు వీలైనంత మేర అందించామని కలెక్టర్ తెలిపారు. ఆపద కాలంలో ప్రజలకు ఖమ్మం జిల్లా సిబ్బంది విలువైన సేవలు అందించారని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. పారిశుధ్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, అధికారులు, హోం గార్డ్ స్థాయి నుండి జిల్లా అధికారి స్థాయి వరకు, ప్రతి ఒక్క అధికారి, సిబ్బంది అందరూ చిత్తశుద్ధితో పని చేసారని కొనియాడారు. మానవతా దృక్పథంతో అధికారులు పనిచేశారని, వరదల వంటి విపత్కర సమయంలో కలసికట్టుగా పనిచేసి విలువైన సేవలు అందించారని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ విక్రం సింగ్, ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, డిఆర్వో రాజేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, మునిసిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

## హుజురాబాద్ 26 వార్డులో.. వినాయక మండపాల వద్ద భక్తుల సందడి

**కన్నులపండుగగా కుంకుమ పూజలు, అన్నదాన కార్యక్రమాలు**



హుజురాబాద్ సెప్టెంబరు 13 జనతా న్యూస్: హుజురాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని 26 వ వార్డు పరిధిలో సూపర్ బజార్, ఓల్డ్ సూపర్ బజార్, ఇల్లందుల వీధి లో వినాయక నవరాత్రి ఉత్సవాలు గల్లి గల్లి లో ప్రారంభమయ్యాయి. విగ్రహాలు, మండపాలు ప్రతి ఏడాది ఏర్పాటు చేస్తున్నట్టుగానే ఈసారి కూడా ఏర్పాటు చేశారు. ప్రతిరోజు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆటపాటలు భజనలతో మండపాల్లో భక్తుల సందడి కనిపిస్తోంది. గణేష నవరాత్రి ఉత్సవాల వద్ద అర్చనలు, హోమాలు, కుంకుమ పూజలతో పాటు ప్రతి మంటపం వద్ద అన్నదాన కార్య క్రమాలు నిర్వాహకులు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. సూపర్ బజార్ రోడ్డు లో గణేష్ భక్త మండలి ఆధ్వర్యంలో 26 ఏళ్లుగా నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ మండపం వద్ద నిత్యాన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ గణేశ నవరాత్రి మండపాల వద్ద పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా మున్సిపాలిటీ, పోలీసు, విద్యుత్తు తదితర అధికారులు, సిబ్బంది, నిర్వాహకుల సహకారంతో గత 20 ఏళ్లుగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నట్లు 26 వ వార్డు కౌన్సిలర్ కేసిరెడ్డి లావణ్య తెలిపారు. సోమవారం జరిగే నిమజ్జనం కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని ఆమె కోరారు. గణేశ నవరాత్రి ఉత్సవ నిర్వాహకులను ఆమె అభినందించారు.

## చర్చ్ ఫాదర్ పై హత్యప్రయత్నం కేసు..

**18 మందికి ఒక్కొక్కరికి రూ.10,000 జరిమానా**

రాజన్న సిరిసిల్ల,జనత న్యూస్: చర్చ్ ఫాదర్ పై హత్యప్రయత్నం కేసులో 18 మందికి ఒక్కొక్కరికి రూ.10,000 జరిమానా విధిస్తూ వేములవాడ సబ్ జడ్జి రాధికా జైశ్వాల్ శుక్రవారం తీర్పు వెల్లడించారని వేములవాడ టౌన్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.వేములవాడ పట్టణ పరిధిలోని చర్చ్ నందు ఫాదర్ గా పని చేయుచున్న బ్రదర్ సువర్ణ పాల్ పై అదే చర్చ్ నందు ఫాదర్ పని చేసి తొలగించబడిన తిమేతి అనే వ్యక్తి తనను తీసివేయడానికి కారణమని అతనిని చర్చ్ నుండి ఎలాగైనా కాళీ చేపించాలని 2015 సంవత్సరంలో అక్రమంగా తన అనుచరులు 17 మందితో కలసి చర్చ్ లోకి ప్రవేశించి బ్రదర్ సువర్ణపాల్ పై హత్యప్రయత్నం చేశారు.సువర్ణ పాల్ పిర్యాదు మేరకు అప్పటి ఎస్.ఐ లక్ష్మయ్య కేసు నమోదు చేశారు.ఇన్స్పెక్టర్ వెంకటేష్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.సీఎంఎస్ ఎస్ఐ రవీంద్ర నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ సురేష్, కానిస్టేబుల్ మధుసూదన్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున ఆడిషన్ పిపి గడ్డం లక్ష్మణ్ వాదించగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి రాధికా జైశ్వాల్ నిందుతులకు ఒక్కకరికి రూ.10,000 జరిమానా విదించినట్లు వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ తెలిపారు.

## సరస్వతి శిశుమందిరంలో అన్నప్రసాదం పంపిణీ



వేములవాడ,జనత న్యూస్: శ్రీ సరస్వతీ శిశు మందిరంలో గణేష్ నవరాత్రుల సందర్భంగా పాఠశాలలో అన్న ప్రసాద పంపిణీ శుక్రవారం నిర్వహించారు.పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ కే మనోహర్,పాఠశాల ప్రధానాచార్యులు చిలుక గట్టు, పాఠశాల మాతాజీలు,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం..

**ప్రతిమల శోభాయాత్ర రూట్‌మ్యాప్ నిర్దేశించాలి..**

**అధికారులతో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీక్ష**

ఖమ్మం-జనత న్యూస్ : ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం నిర్వహించడానికి సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వినాయక నిమజ్జన ఏర్పాట్లపై ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ, మధుసూదన్ నాయక్ లతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. 6న సోమవారం వినాయక నిమజ్జనం చేస్తారని, మంగళవారం కూడా విగ్రహాల నిమజ్జనం కొనసాగుతుందన్నారు. ఖమ్మం నగరం, వైరా, సత్తుపల్లి, మధిర మున్సిపాలిటీలలో అవసరమైన ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని సూచించారు. గణేశ్ ప్రతిమల శోభాయాత్ర వేడుకలకు రూట్‌మ్యాప్ తయారు చేసుకోవాలని అధికారులకు సూచించారు. అవసరమైన రోడ్డు మరమ్మతు పనులు వెంటనే చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. వినాయక నిమజ్జన స్థలాల వద్ద క్రేన్లు ఏర్పాటు చేయాలని అన్నారు. నిమజ్జనం చేసే ప్రదేశాలలో అవసరం మేరకు బారికేడ్లు ఏర్పాటు చేయాలని, వైద్య శిభిరాలను, ఫస్ట్ ఎయిడ్ కిట్స్ తో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా జిల్లా వైద్యాధికారి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గణేష్ నిమజ్జనం జరిగే ప్రదేశాలలో గజ ఈతగాళ్లను సిద్ధం చేయాలని, ఆయ రూట్లలో త్రాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, మెడికల్, లైటింగ్ వంటి సౌకర్యాలు వుండేలా చూడాలని అన్నారు.

**కట్టుదిట్టమైన భద్రత : పోలీసు కమీషనర్**

గణేష్ నిమజ్జనానికి కట్టు దిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తామని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. సెప్టెంబర్ 16న వెయ్యికి పైగా విగ్రహాలు, సెప్టెంబర్ 17న 800 నుండి 900 వరకు విగ్రహాలు నిమజ్జనం అయ్యే అవకాశం ఉందన్నారు. ఇందుకు వీలుగా ప్లాట్ ఫారం వద్ద అవసరమైన క్రేన్ లు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ విక్రం సింగ్, ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, రెవెన్యూ అధికారి రాజేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

## చిగురుమామిడిలో బిఆర్ఎస్ నాయకుల అరెస్ట్

**పాలకుల తీరుపై అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేత**



చిగురుమామిడి జనత న్యూస్: హైదరాబాద్ కు వెళ్తున్న మండల బీఆర్ఎస్ నాయకులను శుక్రవారం పోలీస్ లు అడ్డుకొని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.పోలీసుల అరెస్టుపై బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. ఎమ్మెల్యేలకే రక్షణ లేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.బీఆర్ఎస్ పార్టీ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇంటిపై అధికార పార్టీ అండదండలతో కాంగ్రెస్ పార్టీ గుండాలతో ఎమ్మెల్యే ఆర్కేపూడి గాంధీ దౌర్జన్యం చేశారాన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి ప్రజలు ఓటేస్తే, ఇచ్చిన హామీలను నెరవేరచాల్సింది పోయి గూండగిరి చేస్తున్నారని అన్నారు.ఒక ఎమ్మెల్యే ఇంటిపైనే ఇలా దాడులు చేస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.రాష్ట్రంలోని రైతులకు రైతు బంధు రాకపోగా,రుణమాఫీ కాకపోవడంతో రైతుల ఆత్మహత్యల వైపు మొగ్గ చూపుతున్నారని అంజయ్య ఆవేదన వ్యక్తం చేశారు.అక్రమ అరెస్టులకు భయపడేది లేదన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ గుండారాజ్ ప్రభుత్వం నడుస్తుందని,ప్రజలు పాలన చేయమని అధికారం కట్టబెడితే ప్రజా సంక్షేమం పక్కనబెట్టి కేవలం కాంగ్రెస్ గుండా రాజకీయం చేస్తుందన్నారు.అధికారం ఎవ్వరికి శాశ్వతం కాదని వాళ్ళు గుర్తించాలని,మండలంలోని బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు ఎవ్వరు కూడా భయపడొద్దన్నారు.కాంగ్రెస్ పార్టీ విద్రోహ,వికృత,అప్రజాస్వామిక వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నమన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రోద్బలంతో జరిగిన దాడి ఇది కాబట్టి వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి క్షమాపణలు చెప్పాలన్నారు.అలాగే ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి పూర్తి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ చిగురుమామిడి గ్రామ శాఖ అధ్యక్షుడు ఆకవరం శివప్రసాద్,సింగిల్ విండో డైరెక్టర్ పొతరవేణి శ్రీనివాస్ యాదవ్, మాజీ సర్పంచులు సన్నీల్ల వెంకటేష్, బోయిని శ్రీనివాస్,సీనియర్ నాయకులు మహంకాళి కొమురయ్య, గ్రామ శాఖల అధ్యక్షులు అనంత్ రెడ్డి,కలవాల సంపత్ రెడ్డి,తదితరులు ఉన్నారు.

## మహిళల సమస్యల పరిష్కారానికి 'శుక్రవారం సభ'



చిగురుమామిడి జనత న్యూస్: మహిళల సమస్యల పరిష్కారానికి 'శుక్రవారం సభ' ఎంతగానో దోహదపడుతుందని ఎంపీడీవో ఖాజా మొయినోద్దీన్ అన్నారు. చిగురుమామిడి గ్రామంలో శుక్రవారం అంగన్వాడి (1) కేంద్రంలో శుక్రవారం సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా వచ్చిన ఎంపీడీవో సభ యొక్క ముఖ్య ఉద్దేశంపై తల్లులకు వివరించారు. ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉంటేనే వారి కుటుంబం అలాగే గ్రామం ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. 'ఆరోగ్య మహిళా' కార్యక్రమంలో ప్రతి గురువారం మండల ప్రాథమిక వైద్యశాలలో మహిళలకు 52 రకాల పరీక్షలు ప్రభుత్వం ఉచితంగా చేస్తున్నారని దీనిని ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్ వాడి సెంటర్ లో గర్భవతులకు, బాలింతలకు ఇచ్చే ఆహారాన్ని సెంటర్ కు వచ్చి ఆహ్లాదకరమైన వాతావరణంలో భోజనం చేయాలని. పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా పుట్టడానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్, పంచాయితీ కార్యదర్శి రమేష్, ఏఎన్ఎం స్వరూప రాణి, అంగన్వాడీ టీచర్లు ధనలక్ష్మి, అనురాధ, సంపూర్ణ, ఇందిరా,అశాలు పద్మ, సరోజన, లక్ష్మీ, గర్భవతులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

## ప్రతి ప్రైమరీ పాఠశాలకు హెచ్ఎం పోస్టు ఇస్తూ బీఈడీ వారికి కూడా అర్హత కల్పించాలి

**ఎస్ జి టి లకు కూడా ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలి**

**టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్ రెడ్డి**



ఇల్లంతకుంట జనతాన్యూస్.ప్రతి ప్రాథమిక పాఠశాలకు పీఎస్ హెచ్ఎం పోస్టును ఇస్తూ బీఈడీ అర్హత ఉన్న ఎస్జీటీలకు కూడా ప్రమోషన్ కల్పించాలని టిపిటిఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. శుక్రవారం రోజున ఇల్లంతకుంట మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జరిగిన సంఘ సభ్యత్వం తో పాటుగా ఉపాధ్యాయ సమస్యల సేకరణ కార్యక్రమం సందర్భముగా అధ్యక్షుడు భూపాల్ రెడ్డి మాట్లాడుతూ. చాలా విషయాలలో ఎస్జీటీలకు కొంత అన్యాయం జరుగుతున్న విషయం వాస్తవమేనని ఎస్జీటీ లపైన వివక్ష చూపడం సరైంది కాదని, ఈ మధ్య జరిగిన ప్రమోషన్లలో బీఈడీ అర్హతతో నియామకమైన ఎస్ జి టి లకు ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ ఎం ప్రమోషన్ ఇవ్వడంలో తీవ్ర అన్యాయం జరిగిందని ఇకముందు వచ్చే ప్రమోషన్లలో న్యాయం చేస్తామని కంటి తుడుపు చర్యగా చెప్పడమే తప్ప ప్రభుత్వం నుండి స్పష్టమైన హామీ రావడం లేదని వారి సమస్యలు అందరూ పట్టించుకోవాలంటే ముందుగా వారికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని అలా వారికి ఓటు హక్కు వస్తేనే వారికి పూర్తి న్యాయం జరుగుతుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని పి ఎస్ హెచ్ఎం పోస్ట్ లని 10వేలకు పెంచి బీఈడీ అర్హత గల ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే 317 %+ూ% బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేస్తూ వారిని స్థానిక ప్రాంతాలకు బదిలీ చేయాలని అన్నారు. అలాగే సిపిఎస్ రద్దు కి సహకరిస్తూ ప్రక్రియని వేగవంతం చేయాలని,ఆర్థిక శాఖ వద్ద పెండింగ్లో ఉన్న అన్ని బిల్లులను వెంటనే విడుదల చేయాలనీ, పెండింగ్లో ఉన్న 5 డి.ఎ.లను వెంటనే విడుదల చేయాలనీ పిఆర్సి కమిటీ రిపోర్టును వెంటనే తెప్పించి అమలు చేయాలనీ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలు పూర్తి చేసి. 010 ద్వారా వేతనాలు చెల్లించాలనీ కెజిబివి మరియు యు.ఆర్.ఎస్. ఉపాధ్యాయులు మరియు ఎస్ ఎస్ ఎ సిబ్బందికి కనీసం మూల వేతనం చెల్లించాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో టి పి టి ఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి దుమాల రమానాథ్ రెడ్డి మండల అధ్యక్షులు ,ప్రధాన కార్యదర్శి లావుడ్యా శ్రీనివాస్ నాయక్ , బోయిన్ పల్లి ప్రధాన కార్యదర్శి కుమార్,సీనియర్ నాయకులు అద్దిక రాజశేఖర్ రెడ్డి, దరిపెల్లి వెంకటయ్య,కృష్ణ చైతన్య, పదిరే బాలా గౌడ్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనంలో నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి

**ఇల్లంతకుంట ఎస్సై కదిరె శ్రీకాంత్ గౌడ్**




ఇల్లంతకుంట జనతాన్యూస్ వినాయక నిమజ్జన సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు ఎస్సై కదిరె శ్రీకాంత్ గౌడ్ చెప్పారు. శుక్రవారం రోజున ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వైశ్య భవన్ లో వివిధ గ్రామాలలోని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో ఇల్లంతకుంట ఎస్సై సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక నిమజ్జన సమయంలో ఏ ఒక్కరు కూడా అజాగ్రత్తగా ఉండకూడదని ప్రతి ఒక్కరు కూడా గణేష్ నిమజ్జనం అయ్యేంతవరకు బాధ్యతగా వ్యవహరించాలని గణేష్ నిమజ్జనం వెళుతున్న దారిలో విద్యుత్ వైర్లు తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని నిమజ్జనం చేసే ప్రాంతం వద్ద కూడా ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే లౌడ్ స్పీకర్లకు డీజే లకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతి లేదన్నారు. మద్యం సేవించి గణేష్ శోభాయాత్రలో పాల్గొనరాదని నిర్వాహకులకు తెలియజేశారు. మండలంలోని గణేష్ ఉత్సవాలు నిబంధనలకు విరుద్ధంగా ఎవరు కూడా వ్యవహరించవద్దని ప్రతి ఒక్కరూ ప్రతి గ్రామంలో శాంతియుతంగా నిమజ్జనం నిర్వహించుకుని అధికారులకు పోలీసుశాఖ వారికి సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల గణేష్ నిర్వాహ కమిటీ సభ్యులు రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు

## ఆర్టీసీ బస్సులో చెలరేగిన మంటలు

***మంటలార్పిన కుకునూరుపల్లి పోలీసులు***

***అభినందనలు తెలిపిన ప్రయాణికులు***



సిద్దిపేట,జనత న్యూస్: కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మెదినీపూర్ బస్సు స్టేజ్ వద్ద శుక్రవారం కరీంనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నెంబర్ టీఎస్ 09 జెడ్ 7645 కరీంనగర్ నుండి సికింద్రాబాద్ వెళ్తున్న సమయంలో బస్సు ఇంజన్లో అకస్మాత్తుగా మంటలు చేలరేగి పొగలు వస్తున్నాయని గమనించి డయల్ 100 కాల్ ద్వారా పోలీసులకు పిర్యాదు చేశారు.సమాచారంతో కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బందితో కలిసి హుటాహుటిన సంఘటనా స్థలానికి బయలుదేరి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వెంటనే బస్సులోని ప్యాసింజర్ అందర్నీ కిందికి దిగమని తెలపగానే అందరూ కిందికి దిగినారు. ఇంజన్లో నుండి మంటలు, పొగలు వస్తుండగా వెంటనే నీళ్లు తెప్పించి మంటలు ఆర్పినారు. బస్సులో ఉన్న ప్రయాణికులు పోలీసులు వచ్చి ఎలాంటి ప్రమాదం జరగకుండా వెంటనే స్పందించి మంటలు ఆర్పిన కుకునూరు పల్లి పోలీసులను అభినందించారు.సీపీ డాక్టర్ బి. అనురాధ కుకునూరుపల్లి పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విధులు నిర్వహించినందుకు ఎస్ఐ శ్రీనివాస్,హెడ్ కానిస్టేబుల్ రమణమూర్తి,సిబ్బంది శేఖర్,శ్రీనివాస్,రాకేష్, వంశీని అభినందించారు.

## కానిస్టేబుల్ శంకర్ సస్పెండ్..

సిద్దిపేట,జనత న్యూస్: పోలీస్ డిపార్ట్మెంట్ సీసీఏ రూల్స్ అతిక్రమించి క్రమశిక్షణ రహితంగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపణలతో విచారణ చేపట్టి నిజ నిర్ధారణవ్వడంతో రాజగోపాలపేట పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఏ శంకర్ ను సస్పెండ్ చేస్తూ శుక్రవారం సీపీ అనురాధ ఉత్తర్వులు జారీ చేశారు.పోలీస్ డిపార్ట్మెంట్లో క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని.. క్రమశిక్షణ రహితంగా విధులు నిర్వహించే అధికారులను సిబ్బందిని ఉపేక్షించేది లేదని సీపీ హెచ్చరించారు.

మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక

# ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**




కరీంనగర్–జనత న్యూస్ : బాలబాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ లోని ఫిలిం భవన్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన కౌమార విద్య అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కౌమార దశలో సన్మార్గంలో నడవాలని, సమాజ ధోరణి తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. హాజరైన ప్రతి విద్యార్థి వారి పాఠశాల విద్యార్థులందరికీ అవగాహన కల్పించాలన్నారు. సాంఘిక అసమానత్వాన్ని వీడాలని సూచించారు. సమాజంలో జీవించే హక్కు అందరికీ ఉందని, వ్యాధిగ్రస్తుల పట్ల మానవత్వం చాటాలని పేర్కొన్నారు. యవ్వన దశలో విద్యార్థులు చెడు మార్గాల్లో వెళ్లకూడదని సూచించారు. నేర్చుకోవాలననే తపన ఉంటే ఏదైనా సాధ్యమేనని తెలిపారు. భాష అనేది ఒక మాధ్యమం మాత్రమేనని, జ్ఞానానికి, భాషకు సంబంధం లేదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివేవారు ఎక్కువ జ్ఞానాన్ని సంపాదిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా విద్యాధికారి జనార్ధన్ రావు, విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, డిజిసిఓ కృపారాణి పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి సైన్స్ మ్యూజియం సందర్శించాలి

**సెలవు రోజుల్లోనూ సందర్శనకు అవకాశం : జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



కరీంనగర్–జనత న్యూస్ : నగరంలోని పురాతన పాఠశాలలో ఆధునీకరించిన సైన్స్ మ్యూజియాన్ని ప్రతి విద్యార్థి సందర్శించాలని, ఇందుకు ఒక ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి విద్యాధికారిని ఆదేశించారు. సైన్స్ మ్యూజియాన్ని శుక్రవారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా మ్యూజియంలోని మినీ ప్లానిటోరియం, డైనోసారోస్, బయాలజికల్, వివిధ రకాల సైన్స్ పరికరాలను పరిశీలించారు. కరోనా సమయంలో మూతపడిన ఈ మ్యూజియాన్ని తిరిగి ప్రారంభించామని తెలిపారు. విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించే ఎన్నో పరికరాలు ఇక్కడ ఉన్నాయని అన్నారు. మ్యూజియం నిర్వహణకు సిబ్బందిని కేటాయిస్తామని తెలిపారు. అనంతరం పిల్లల సందర్శనకు అనుమతి ఇవ్వాలని సైన్స్ అధికారి జైపాల్ రెడ్డిని ఆదేశించారు. ప్రతి విద్యార్థి సైన్స్ మ్యూజియాన్ని సందర్శించేలా ప్రణాళిక ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాధికారికి సూచించారు. సెలవు రోజుల్లోనే విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. సోలార్ తో నడిచే వివిధ రకాల యంత్రాలు, ట్రాఫిక్ లైట్స్ వంటివి ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి పరికరం వద్ద విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరణ బోర్డులను ఏర్పాటు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా విద్యాధికారి జనార్ధన్ రావు, ఎంఈఓ మధుసూదన్, డి సి బి సెక్రటరీ స్వదేశ్ కుమార్, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆసుపత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



జగిత్యాల,జనత న్యూస్: సారంగాపూర్ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ సత్య ప్రసాద్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు.ఓప సేవలు,ఐపీ సేవలు, రికార్డ్స్ ల్యాబ్ రికార్డ్స్,ఐపీ,రికార్డ్స్ మెడికల్ ఫార్మసి , కలెక్టర్ పరిశీలించారు.ఆసుపత్రిలో వైద్య సేవలను మెరుగు పరచాలని, డాక్టర్లు సమయ పాలన పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. రోజుకు ఎన్ని ఓపీలు చూస్తున్నారు? ఆసుపత్రిలో పేషెంట్లకు శుభ్రమైన త్రాగునీరు అందిస్తున్నారా? అంటూ వివరాలు తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు మలేరియా,డెంగ్యూ, ఇతర వ్యాధుల పట్ల అప్రమత్తమయి పేషెంట్లకు ఇబ్బంది కలుగకుండా వైద్య సేవలు కల్పించాలని సూచించారు.అనంతరం ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి చుట్టుపక్కల పిచ్చి మొక్కలను తొలగించి పక్కనే నిరూపయోగ వాటర్ ట్యాంక్ పై నీరు నిల్వను గమనించి దోమలు వృద్ధి చెందే అవకాశం ఉన్నదని వెంటనే శుభ్రం చేయించి శానిటేషన్ చేయించాలని అధికారులను ఆదేశించారు.జగిత్యాల ఆర్డీఓ మధుసుధన్, డిప్యూటీ డిఎంహెచ్ఓ శ్రీనివాస్,ఎమ్మార్వో,ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యా ప్రమాణాల లక్ష్యాలను సాధించాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పాఠశాలకు విద్యార్థుల హాజరు పెరిగేలా ఫాలో అప్ చేయాలి**

**తుర్కలమద్దికుంట ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**



పెద్దపల్లి,జనత న్యూస్: విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు దిశగా నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి మండలంలోని తుర్కలమద్దికుంట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులు హాజరు శాతం తక్కువగా ఉండటం గమనించిన కలెక్టర్ పిల్లల హాజరుపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి రెగ్యులర్ గా పాఠశాలకు రాని విద్యార్థులను ఎప్పటికప్పుడు ఫాలోఅప్ చేయాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలైనా చదవడం,రాయడం, బేసిక్ గణిత పరిజ్ఞానం ఉండే విధంగా లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధన దిశగా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కాంప్లెక్స్ సమావేశాలకు హాజరవుతున్న ఉపాధ్యాయులు అక్కడ అందిస్తున్న సూచనలు పాటిస్తూ వినూత్న రీతులు విద్యార్థులకు విద్యాబోధన చేయాలన్నారు.రెగ్యులర్ గా విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తూ వారి ప్రమాణాలను పరీక్షిస్తూ పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యల పై శ్రద్ధ వహించాలన్నారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజులత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పార్టీ అండగా ఉంటుంది

## అదే స్ఫూర్తితో పోరాడు..

## కౌశిక్ కు కెసిఆర్ ఫోన్?



( జనతా న్యూస్ హుజరాబాద్) : గత రెండు రోజుల నుండి జరిగిన రాజకీయ పరిణామాలు రాష్ట్రాన్ని అట్టుడికించి వేయగా.. గులాబీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. శుక్రవారం సాయంత్రం కౌశిక్ రెడ్డి తో ఫోన్లో మాట్లాడినట్టు తెలుస్తోంది. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో హైకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో హుజురాబాద్ పాడి కౌశిక్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నేతల మధ్య మాటల యుద్ధం జరుగుతున్న విషయం తెలిసిందే. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను సవాల్ చేయడం, శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ తో పాటు ఆయన అనుచరులు కౌశిక్ రెడ్డి నివాసం పై దాడి చేయడం, మాజీ మంత్రులు హరీష్ రావు, గంగుల కమలాకర్, సబితా ఇంద్రారెడ్డి, ప్రశాంత్ రెడ్డి తదితరులు కౌశిక్ రెడ్డికి మద్దతునిచ్చి ఆందోళన చేయడం, వారిని పోలీసులు అరెస్టు చేసి తరలించడం, శుక్రవారం కూడా బి అర్ ఎస్ పార్టీ నేతలను రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు ఎక్కడికి అక్కడ నిర్బంధించడం జరిగిన విషయం తెలిసిందే. ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారాయి. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని ఉత్కంఠను రేపాయి. ఈ నేపథ్యంలోనే గులాబీ బస్ కెసిఆర్ కౌశిక్ రెడ్డితో కొద్దిసేపు మాట్లాడినట్టు సమాచారం అందింది.

**అండగా ఉంటాం..**

తొలిసారిగా హుజరాబాద్ లో గెలిచి గులాబీ జెండా ఎగరేసావు. నీకు మంచి భవిష్యత్తు ఉంది. ఎమ్మెల్యేల అనర్హత వేటు విషయంలో.. గట్టిగా నీ వాయిస్ను వినిపించావు. నీ ఇంటి పై దాడి చేయడం అమానుషం. దీని వెనుక ప్రభుత్వ కుట్ర ఉంది. పార్టీ నీకు అండగా ఉంటుంది. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రభుత్వ కుట్రలపై నీ పోరాటాన్ని ఇలాగే కొనసాగించాలి. నీ వ్యాఖ్యలను వక్రీకరించి నిన్ను నియంత్రించే ప్రయత్నాలు కాంగ్రెస్ పార్టీ చేస్తుంది.. అని కెసిఆర్ పేర్కొన్నట్టు తెలిసింది.

**నీ మాటలను వక్రీకరిస్తారు**

తాను కూడా ఉద్యమ సమయంలో.. మాట్లాడిన ప్రతి మాటను వక్రీకరించే ప్రయత్నాలు నాటి తెలుగుదేశం కాంగ్రెస్ పార్టీలో చేశాయి.. అయినా గొప్ప స్ఫూర్తితో పోరాడి తెలంగాణ సాధించుకున్నాం.. పదేళ్ల రాష్ట్రాన్ని అభివృద్ధి చేశాం.. కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలు ఇచ్చి ప్రజలను నమ్మించి మోసం చేసి అధికారంలోకి వచ్చింది. ఆ పార్టీతో అయ్యేది ఏమీ లేదు. భవిష్యత్తు మనదే.. ప్రజలు ఇప్పటికే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు.. నీ మాటలను కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు.. అధికార పార్టీలో చేరిన ఎమ్మెల్యే ఫ్రస్టేషన్ చూస్తే ఇదే కనిపిస్తోంది.. అని కెసిఆర్ కౌశిక్ తో అన్నట్లు సమాచారం.

**ఉద్దేశపూర్వకంగానే అణిచివేత**

కాంగ్రెస్ ప్రభుత్వం భవిష్యత్తులో ఇంకా కక్షపూరితంగా వ్యవహరిస్తుంది. హరీష్ రావును, మంత్రులను కూడా అరెస్టు చేసి.. ఎక్కడికో తరలించి కేసులు పెట్టారు.. నిన్ను అడ్డుకున్నారు.. కానీ అధికార పార్టీలో చేరిన ఎమ్మెల్యేను తన అనుచరులతో గూండాలతో నీ ఇంటి వరకు ఎలా అనుమతించారు? ఇది కావాలనే చేసిన దాడి.. అధికార పార్టీ ఆదేశాల మేరకే పోలీసులు నడుచుకున్నారు. ఇది నీ ఇంటిపై జరిగిన దాడి కాదు.. యావత్తూ పార్టీ యంత్రాంగం పై జరిగిన దాడి.. రాబోయే కాలంలో ఇలాంటివి ఇంకా జరుగుతాయి.. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టే పరిస్థితి వస్తుంది. ఇలాంటి వాటికి బెదరొద్దు. దూకుడు ప్రదర్శించే నీలాంటి నేతలను కట్టడి చేసే ప్రయత్నం చేస్తారు.. ఇలాంటి కేసులు అణచివేతలు ఉద్యమ కాలంలో ఎన్నో చూసాం.. ఎండ్ ఆఫ్ ద డే.. ప్రజలు కాంగ్రెస్కు గుణపాఠం చెప్పడం ఖాయం.. ప్రజలు రాష్ట్రంలో జరిగే ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు.. అని ఆయన అన్నట్టు సమాచారం.

**ఎవరికి ఏమీ తక్కువ చేయలేదు**

పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ మారారు. వారందరికీ టికెట్లు ఇచ్చాం.. గెలిపించుకున్నాం.. బిఆర్ఎస్ పార్టీ లేకుండా చేయాలన్నది వారి ప్రణాళిక. కానీ అది వారికి సాధ్యం కాదు. ప్రజల గుండెల్లో పార్టీ ఉంది. నాయకులు వస్తుంటారు.. పోతుంటారు.. కొద్దిమంది వారి సొంత లాభం కోసం అధికార పార్టీలోకి వెళ్లినా నష్టం ఏమీ లేదు. ఇలాంటి అవకాశవాదులు ఉన్న ఒకటే లేకున్నా ఒకటే.. నీ ఇంటి పై దాడి చేస్తే ప్రజల నుండి ఎలాంటి స్పందన వచ్చిందో చూశాం. హరీష్ రావు అరెస్టు చేసిన సమయంలోను కార్యకర్తలు ఎలా తిరగబడ్డారో చూసాం.. భవిష్యత్తులో ఉద్యమాన్ని పరిస్థితులను మనం చూడబోతున్నాం. ఎక్కడ తగ్గొద్దు.. అని కెసిఆర్ అన్నట్టు తెలుస్తోంది.

# నేడు జిల్లాలో డిప్యూటీ సీఎం పర్యటన...

**ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**కట్కెనపల్లిలో 33/11 కేవిఏ సబ్ స్టేషన్ పనుల శంకుస్థాపన**

**డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించిన ప్రభుత్వ విప్**



ధర్మారం,జనత న్యూస్: జిల్లాలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.శుక్రవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మారం మండలం నంది మేడారం పంప్ హౌస్ వద్ద ఏర్పాటు చేసిన హెలి ప్యాడ్ ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష , రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ లతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ డిప్యూటీ ముఖ్యమంత్రి ధర్మారంలో పర్యటించనున్నట్టు తెలిపారు.ఉపముఖ్యమంత్రి పర్యటనకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేశామని, పెద్ద ఎత్తున ప్రజలు విచ్చేసి ఉప ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేస్తున్నామన్నారు.నేడు ఉదయం 10.20 గంటలకు ధర్మారం మండలం నంది మేడారం పంప్ హౌస్ వద్ద ఏర్పాటు చేసిన హెలీ ప్యాడ్ కు ఉప ముఖ్యమంత్రి , రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి, రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి చేరుకుంటారన్నారు. రోడ్డు మార్గం ద్వారా ధర్మారం మండలం కట్కెనపల్లి గ్రామానికి చేరుకొని అక్కడ 33/11 కేవిఏ సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేస్తారని, అనంతరం ధర్మారం మండలం మార్కెట్ కమిటీ చేరుకుని స్థానికంగా ఏర్పాటుచేసిన కార్యక్రమాలలో ఉప ముఖ్యమంత్రి బృందం పాల్గొంటుందని తెలిపారు.నంది మేడారం నుంచి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామానికి మధ్యాహ్నం 2.15 గంటలకు ఉపముఖ్యమంత్రి బృందం చేరుకుంటుందని, అక్కడ 132 కేవి సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి ప్రజలతో ఇంట్రాక్ట్ అవుతారని అన్నారు.అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు ఉపముఖ్యమంత్రి బృందం పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామానికి చేరుకొని అక్కడ ఎన్ఈ ఎన్.పి.డి.సి.ఎల్ భవనం, 33/11 కేవి సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని కలెక్టర్ తెలిపారు.అనంతరం రోడ్డు మార్గం ద్వారా ఉపముఖ్యమంత్రి బృందం పెద్దపల్లి పట్టణానికి చేరుకుని ఇక్కడ మార్కెట్ యార్డ్ 33/11 కేవి సబ్ స్టేషన్, పెద్ద రాతిపల్లి 33/11 కేవి సబ్ స్టేషన్, అమృత్ 2.0, టీయూఎఫ్ఐబీసీలో త్రాగునీటి ప్రాజెక్టు, రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయ భవనానికి శంకుస్థాపన చేసి అనంతరం అక్కడ నిర్వహించే బహిరంగ సభలో డిప్యూటీ ముఖ్యమంత్రి పాల్గొంటారని తెలిపారు.బహిరంగ సభ అనంతరం డిప్యూటీ ముఖ్యమంత్రి పెద్దపల్లి వద్ద ఏర్పాటుచేసిన హెలిపాడ్ ద్వారా హైదరాబాద్ కు బయలుదేరుతారని కలెక్టర్ పేర్కొన్నారు.

డిప్యూటీ సీఎం బృందానికి అవసరమైన మేర అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నామన్నారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట డీసీపీ చేతన, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



పెద్దపల్లి,జనత న్యూస్: పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అధిక సంఖ్యలో ప్రజలు వేచి చూడకుండా రిజిస్ట్రేషన్లు , మ్యూటేషన్ డాక్యుమెంట్లను త్వరితగతిన సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రామగుండం సబ్ రిజిస్టర్ కార్యాలయం తరలించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది వారు నిర్వహిస్తున్న విధుల అడిగి తెలుసుకున్న కలెక్టర్ పలు సూచనలు చేశారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట పెద్దపల్లి సబ్ రిజిస్టర్ బి కుమార్,రామగుండం సబ్ రిజిస్టర్ తిరుపతి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నిందితుడి అరెస్ట్..

సిద్దిపేట,జనత న్యూస్: ఆన్లైన్ ట్రేడింగ్ ఇన్వెస్ట్మెంట్ లో డబ్బులు పెడితే ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మించి మోసం చేసిన సైబర్ నిందితున్ని అరెస్టు చేసినట్టు సిద్దిపేట సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు.నిందితుడి వివరాలను ఏసీపీ వెల్లడించారు.భీమీశెట్టి వెంకటరామ్(45)అనకాపల్లి నివాసి.హైదరాబాదు హైటేక్ సిటీ మాదాపూర్ యందు నివాసముంటున్నాడు.సిద్దిపేట పట్టణంలో పనిచేసే ఒక బ్యాంకు మేనేజర్ కు వాట్సాప్ లో మరియు మెయిల్ కు ఒక లింక్ పంపించి ఇందులో పెట్టుబడి పెడితే ఆన్లైన్ ట్రేడింగ్ లో ఎక్కువ మొత్తంలో డబ్బులు వస్తాయని చెప్పగానే అది నమ్మి ఆశపడి సదరు బ్యాంకు మేనేజర్ ఆన్లైన్ ద్వారా, మరియు గూగుల్ పే ఫోన్ పే ద్వారా ఆన్లైన్ నెట్ బ్యాంకింగ్ ద్వారా 25 రోజులలో 80,00,000/- లక్షల రూపాయలు పంపించాడు.తదుపరి నిందితులకు ఫోన్ చేయగా సెల్ స్విచ్ ఆఫ్ చేసినారు.మళ్లీ కాంటాక్ట్ రానందున నమ్మించి మోసం చేసినారని అనుమానంతో జాతీయ సైబర్ సెల్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కాల్ చేసి వివరాలు తెలిపి పై సైబర్ నిందితులపై సిద్దిపేట సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లో బాధితుడు దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించడం జరిగింది.కేసు పరిశోధనలో నిందితుని వివిధ బ్యాంకు అకౌంట్లో ఫ్రిజ్ అయిన 20 లక్షల రూపాయలు సంబంధిత బ్యాంకు మేనేజర్ కు ఇప్పించామని తెలిపారు.కేసు పరిశోధనలో టెక్నాలజీ ద్వారా నిందితున్ని హైదరాబాద్ హైటెక్ సిటీ వద్ద అదుపులోకి తీసుకొని ట్రేడింగ్ మోసం గురించి విచారించి రూ. 50 వేల నగదు,నిందితుడు ఉపయోగించిన సెల్ ఫోన్,రెండు బ్యాంకులకు సంబంధించిన చెక్ బుక్ లు స్వాధీనం చేసుకుని నిందితున్ని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్ కు పంపించామని సిద్దిపేట సైబర్ సెల్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు.లోన్ యాప్,లాటరి,పార్ట్ టైమ్ జాబ్,విదేశీ ప్రయాణం, తక్కువ పెట్టుబడి తో ఎక్కువ లాభం,పాన్ కార్డ్ అప్డేట్స్,ఆధార్ కార్డు లింక్,పేర్లతో సైబర్ మోసాలు, మెసేజ్ రాగానే ఆశపడి మోసపోవద్దని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ తెలిపారు.

# ఎల్లమ్మ చెరువులో వినాయక నిమజ్జనం

**ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్**

**గణేష్ నిమజ్జనానికి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు**



పెద్దపల్లి,జనత న్యూస్: జిల్లాలో వైభవోపేతంగా గణేష్ నిమజ్జనం జరిపేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేసినట్లు అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ తెలిపారు.శుక్రవారం పెద్దపల్లి ఎల్లమ్మ చెరువు వద్ద గణేష్ నిమజ్జనానికి చేసిన ఏర్పాట్లను అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ పరిశీలించారు.అనంతరం అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ వినాయక నిమజ్జనానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా పూర్తి చేశామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు పోలీసులు అందించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.గణేష్ నిమజ్జన పాయింట్ల వద్ద అవసరమైన మేరకు భారీ క్రేన్లు, లైటింగ్ ఏర్పాట్లు,సీసీటీవీ ఏర్పాట్లు,గణేష్ నిమజ్జనం నేపథ్యంలో గజ ఈతగాళ్లు,మెడికల్ క్యాంపులు,ఫైర్ సర్వీస్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.అంతకుముందు అదనపు కలెక్టర్ మంథనిలోని నిమజ్జనం పాయింట్లను సందర్శించి వినాయక నిమజ్జనానికి చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాక్టీస్ ప్రారంభించిన

## టీమిండియా

భారత ఆటగాళ్ల ముమ్మర కసరత్తు

చెన్నై చేరుకున్న రోహిత్, విరాట్

.. వివరాలు 4లో




# మానేరు జనత

తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక


సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్


14.09.2024
శనివారం saturday
సంపుటి (Volume): 09
సంచిక (Issue) : 156
పేజీలు : 8
Pages : 8
వెల: 5
Published from : Rangareddy, Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad,


తెలుగు ప్రజలకు ప్రధాని

## చవితి కానుక

16న రెండు కొత్త వందే భారత్ రైళ్లకు జెండా

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



తెలుగు ప్రజలకు ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కానుక అందించారు. ఈ నెల 16న ప్రధాని మోదీ తెలుగు రాష్ట్రాల్లో 2 కొత్త వందే భారత్ రైళ్లను ప్రారంభించనున్నారు. నాగ్‌పూర్ - హైదరాబాద్, దుర్గ్ - విశాఖపట్టణం మధ్య రెండు వందే భారత్ రైళ్లు పరుగులు పెట్టనున్నాయి. ఢిల్లీ తర్వాత హైదరాబాద్ నుంచే అత్యధికంగా వందేభారత్ రైళ్ల అనుసంధానత కలిగిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

జనత న్యూస్ హైదరాబాద్ : వయోవృద్ధుల సంక్షేమానికి ప్రధాని మోదీ ఆపన్న హస్తం అందించారని కేంద్రమంత్రి తెలిపారు. 70ఏళ్లు దాటిన వారందరికీ రూ.5లక్షల వరకు ఆరోగ్య బీమా కల్పించారు. పేద, ధనిక తేడా లేకుండా 6 కోట్ల మంది వయోవృద్ధులకు లబ్ధి చేకూరనుంది. వచ్చే రెండేళ్లలో ఈ పథకంపై రూ.3,437 కోట్లను కేంద్రం ఖర్చు చేయనుంది. తెలంగాణ నుంచి అదనంగా మరో 10 లక్షల మంది సీనియర్ సిటిజన్లకు లబ్ధి జరగనుంది. 70 ఏళ్లు

మిగతా 2 లో



# షరతులు లేకుండా నిధులు ఇవ్వాలి

రాష్ట్రం మునిగినా ఎన్‌డీఆర్ఎఫ్ నిధులు వాడుకోలేని స్థితి

ఎస్ఎస్ఆర్, ఎన్‌డీఆర్ఎఫ్‌కు పొంతన లేకపోవడం వల్లే..

- 1350 కోట్ల నిధులున్నా రూపాయి వాడుకోలేకపోతున్నాం
- విపత్తు నిధులపై ఉన్న నిబంధనలను కేంద్రం సడలించాలి
- మున్నేరు ముప్పు నివారణకు రిటైనింగ్ వాల్ తప్పనిసరి
- నిర్మాణానికి కేంద్రం సహకరిస్తే మా వాటా నిధులిస్తాం
- వైపరీత్యాలపై హెచ్చరికల కోసం ఓ వ్యవస్థ ఉండాలి: సీఎం
- కేంద్ర బృందంతో భేటీ.. 10 వేల కోట్ల నష్టంపై నివేదిక
- 'తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవానికి' రండి
- కేంద్ర మంత్రులు అమిత్ షా, గజేంద్రసింగ్, కిషన్‌రెడ్డి, సంజయ్‌లకు సీఎం రేవంత్ ఆహ్వానం

విపత్తుల నిధుల వినియోగానికి సంబంధించి అమల్లో ఉన్న కఠిన నిబంధనలను కేంద్ర ప్రభుత్వం సడలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్‌లో రూ.1,350 కోట్లు అందుబాటులో ఉన్నా.. ప్రస్తుత నిబంధనల ప్రకారం రూపాయి కూడా వాడుకునే పరిస్థితి లేదని కేంద్ర బృందాలకు వివరించారు.

జనత న్యూస్ హైదరాబాద్ : కేంద్రం నిబంధనల ప్రకారం.. ఒక కిలోమీటరు రోడ్డు దెబ్బతింటే కేవలం రూ.లక్ష ఖర్చు చేయాలని నిర్ణయించారని, ఈ రేట్ల ప్రకారం తాత్కాలిక మరమ్మతులు కూడా చేయలేని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. భారీ వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన

మిగతా 2 లో



## నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి

ట్రాఫిక్ వలంటీర్లుగా ట్రాన్స్ జెండర్లు

అధికారులకు సీఎం రేవంత్ సూచన

.. వివరాలు 2లో



జైల్లో పెట్టి వేధించాలని

## చూశారు

నా మనోధైర్యం వందరెట్లు పెరిగింది

తీహార్ జైలు నుంచి విడుదలయిన కేజ్రీవాల్

2



## పోర్ట్ బ్లెయిర్ ఇక శ్రీవిజయపురం

పేరు మారుస్తూ కేంద్రం నిర్ణయం

ఎక్స్ వేదికగా వెల్లడించిన హోంమంత్రి అమిత్ షా

2



# ఆగని రచ్చ

కౌశిక్‌రెడ్డి, అరికెపూడి గాంధీ వివాదంతో ఉద్రిక్తత

- గాంధీ ఇంటికి వెళ్లేందుకు బీఆర్ఎస్ నేతల యత్నం
- హరీశ్, కౌశిక్, శంభీపూర్ రాజు సహా నేతల హౌస్ అరెస్టు
- జిల్లాల్లోనూ పెద్దఎత్తున బీఆర్ఎస్ నేతల గృహ నిర్బంధాలు
- చికిత్స కోసం పోలీసు భద్రత నడుమ ఆస్పత్రికి హరీశ్‌రావు
- ప్రాంతీయ విభేదాలు సృష్టికి కౌశిక్ యత్నం: గాంధీ
- ఆంధ్రా సెటిలర్లపై నాకు ఎంతో గౌరవం ఉంది
- నేను చేసిన వ్యాఖ్యలు గాంధీపై వ్యక్తిగతమైనవే: కౌశిక్‌రెడ్డి
- కౌశిక్‌రెడ్డిని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయాలి: దానం



జనత న్యూస్ : శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మధ్య రాజుకున్న రగడ శుక్రవారం మరింత ఉద్రిక్తతకు దారితీసింది. వందలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి తాను గాంధీ ఇంటికి వెళతానని కౌశిక్‌రెడ్డి ప్రకటించడం, రాష్ట్ర వ్యాప్తంగా కార్యకర్తలు తరలి రావాలని పార్టీ నాయకత్వం పిలుపునిచ్చిన

మిగతా 2 లో

## తెలంగాణలో శాంతిభద్రతలు కరువు

ఉద్యమంలోనూ ఇంతటి నిర్బంధం ఎదుర్కోలే

మీడియాతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు



పదేళ్లపాటు శాంతి భద్రతల సమస్య రాకుండా బీఆర్ఎస్ పాలన సాగిందని.. కానీ ఇప్పుడా పరిస్థితి లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావుఅన్నారు. తెలంగ్ఫాణ ఉద్యమ సమయంలో కూడా ఇంతటి నిర్బంధం ఎదుర్కోలేదని అన్నారు. హైదరాబాద్‌లోని నివాసంలో శుక్రవారం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం వెనక్కి వెళ్తోందని.. శాంతిభద్రతలు క్షీణిస్తుండటంపై పెట్టుబడిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

జనత న్యూస్ హైదరాబాద్ : లా అండ్ ఆర్డర్ అదుపుతప్పడానికి సీఎం రేవంత్ రెడ్డి కారణమని విమర్శలు గుప్పించారు. 'శాంతి భద్రతలు అదుపు తప్పడానికి చేసిందంతా చేసి భాగ్యనగరం బ్రాండ్ ఇమేజ్ గురించి రేవంత్ రెడ్డి మాట్లాడటం సిగ్గుచేటు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి బందోబస్తు ఇచ్చి దాడులు

మిగతా 2 లో

# షరతులు లేకుండా నిధులు ఇవ్వాలి



మొదటి పేజీ తరువాయి
తెలంగాణకు తక్షణమే ఆర్థికసాయం అందించాలని.. ఆపదలో ఉన్న ప్రజలను ఆదుకునేందుకు ఎలాంటి షరతులు లేకుండా నిధులు విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో వరదల వల్ల జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర అధికారుల బృందంతో శుక్రవారం సచివాలయంలో రేవంత్ సమావేశమయ్యారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల రాష్ట్రంలో సంభవించిన అపార నష్టాన్ని కేంద్ర బృందాలకు ఆయన వివరించారు. ఇప్పటి వరకు వివిధ శాఖల నుంచి అందిన వివరాల ప్రకారం రూ.10,032 కోట్ల నష్టం జరిగిందని పేర్కొన్నారు. ఇది మధ్యంతర నివేదిక మాత్రమేనని, పూర్తి వివరాలు రావాల్సి ఉందని చెప్పారు. రాష్ట్రంలో జరిగిన నష్టంతోపాటు ఇక్కడ అమల్లో ఉన్న ఎస్ఎసఆర్ రేట్ల వివరాలను కూడా కేంద్రానికి నివేదిస్తామన్నారు. వాటిని పరిశీలించి విపత్తు సాయం అందించాలని సీఎం కోరారు.

**బాధితులకు ఇళ్ల కోసం నిధులివ్వాలి**

వరదల వల్ల రాష్ట్రంలో లక్షల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని కేంద్ర బృందాలకు రేవంత్ వివరించారు. పంట పొలాల్లో బండరాళ్లు, కంకర, మట్టి మేటలు వేయడంతో రైతులు కోలుకోలేనంత నష్టపోయారని పేర్కొన్నారు. చాలా చోట్ల రహదారులు, రోడ్లు, కల్వర్టులు, చెరువులు కొట్టుకుపోవడంతో నష్టం ప్రాథమిక అంచనాలకు మించిపోయిందని వివరించారు. ఖమ్మం పట్టణంలో మున్నేరు వాగుతో ఉన్న వరద ముప్పును నివారించేందుకు రిటైనింగ్ వాల్ నిర్మించడమే శాశ్వత పరిష్కారం అని స్పష్టం చేశారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి కేంద్రం తగినన్ని నిధులు కేటాయించేలా చూడాలని అధికారులను కోరారు. రిటైనింగ్‌వాల్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం తనవంతు వాటాను భరించేందుకు సిద్ధంగా ఉందన్నారు. రాకాసి తండా, సత్యనారాయణ తండాతోపాటు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న తండాల ప్రజలను సమీపంలోని సురక్షిత ప్రాంతాల్లో ఇళ్లను కేటాయిస్తామని.. నిర్మాణానికి అవసరమైన సహాయాన్ని కేంద్రం అందించాలని కోరారు.

**మేడారం అడవులకూ నష్టం**

వరదలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించాక ఆదుకోవడం కన్నా ముందస్తు చర్యలతో నివారణ మార్గాలపై ఎక్కువ దృష్టిసారించాలని కేంద్ర బృందాలకు సీఎం సూచించారు. వర్షపాతం, వడగాలులు,, పర్యావరణ విపత్తులపై ముందస్తు సమాచారం, హెచ్చరికలు జారీ చేసేలా ఏర్పాట్లు ఉండాలని, వాటిపై దృష్టిసారించాలని కేంద్ర బృందానికి సూచించారు. భవిష్యత్తులో వరదలు వచ్చినప్పుడు ఆదుకునేందుకు తక్షణ సహాయ చర్యలు చేపట్టేందుకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉన్న పోలీసు బెటాలియన్ సిబ్బందికి శిక్షణ ఇచ్చి ఉపయోగించుకోవాలనే ఆలోచనను కేంద్ర బృందంతో సీఎం పంచుకున్నారు. మేడారం అటవీ ప్రాంతంలో వర్షాల కారణంగా 50 ఎకరాల్లో చెట్లు నేలమట్టం అవడంపైనా సమావేశంలో చర్చించారు. దేశంలో ఇప్పటి వరకు వర్షాలకు అడవుల్లో ఇలాంటి ఘటన జరిగినట్లు తమ దృష్టికి రాలేదని కేంద్ర బృందం అభిప్రాయపడింది.
దీనిపై కేంద్రం నుంచి నిపుణుల బృందాన్ని పంపి శాస్త్రీయంగా అధ్యయనం చేయించాలని సీఎం కోరారు. కేంద్రం నుంచి వచ్చిన అధికారుల బృందం రెండు బృందాలుగా విడిపోయి ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లో పర్యటించింది. ఎన్‌డీఎంఏ సలహాదారు కల్నల్ కేపీ సింగ్ సారధ్యంలోని బృందాల్లో శాంతినాథ్, వివప్ప, మహేశ్ కుమార్, నాయల్‌కాన్సర్, రాకేశ్ మీనా, శశివర్ధన్ రెడ్డి ఉన్నారు. సమావేశంలో సీఎంతోపాటు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీమతి శాంతికుమారి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, సంయుక్త కార్యదర్శి హరీశ్ ,ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నగరంలో ట్రాఫిక్ క్రమబద్దీకరణపై దృష్టి**

హైదరాబాద్ సిటీలో రోజురోజుకు ట్రాఫిక్ రద్దీ పెరుగుతున్న క్రమంలో క్రమబద్దీకరణకు చర్యలు తీసుకుంటున్నా ఫలితం ఇవ్వడం లేదు. ఉదయం, సాయంత్రం సమయాల్లో కాలనీల్లోనూ ట్రాఫిక్ జాం అవుతుంది. వాహనాల సంఖ్య కూడా భారీగా పెరుగుతున్నది. ఈ క్రమంలోనే వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తగ్గించేందుకు.. వాహనాలు సాఫీగా సాగేందుకు.. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం సరికొత్త ఆలోచన చేస్తున్నది. హైదరాబాద్ సిటీలో ఫుత్ పాత్ ల అభివృద్ధి, క్లీనింగ్, పరిశుభ్రత, ట్రాఫిక్ అంశాలపై ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా కొన్ని సూచనలు చేశారు. ట్రాఫిక్ స్ట్రీమ్ లైన్ చేయటంలో.. ట్రాన్స్ జెండర్లను వాలంటీర్లుగా ఉపయోగించుకునే అంశాన్ని పరిశీలించాలని ఉన్నతాధికారులకు సూచించారు. హోంగార్డ్స్ తరహాలో వారికి ఉపాధి అవకాశాలను కల్పించే అంశంపై పరిశీలన చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ట్రాఫిక్ వాలంటీర్లుగా సేవలు అందించేందుకు ఆసక్తిగా ఉన్న ట్రాన్స్ జెండర్ల వివరాలు సేకరించాలని.. వారి అభిప్రాయాలు తీసుకోవాలని కోరారు సీఎం రేవంత్ రెడ్డి. ఆర్ అండ్ బీ టెండర్లు పొంది పనుల్లో నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్లను ఉపేక్షించొద్దన్నారు సీఎం. ఎట్టి పరిస్థితుల్లో గడువులోగా పనులు పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారాయన. పనులు చేయని కాంట్రాక్టర్లకు సంబంధించి పూర్తిస్థాయి రిపోర్ట్ 15రోజుల్లోగా అందించాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

# ఆగని రచ్చ

మొదటి పేజీ తరువాయి
నేపథ్యంలో రోజంతా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కౌశిక్‌రెడ్డి, బీఆర్ఎస్ కీలక నేత హరీశ్‌రావు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు సహా ముఖ్య నాయకులందరినీ పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల నేతలను కూడా అక్కడే హౌస్ అరెస్టు చేశారు. పలువురు నేతలు గృహనిర్బంధం నుంచి బయటికి వచ్చేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.
ఈ క్రమంలో పోలీసులతో వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. మరోవైపు ఎమ్మెల్యే గాంధీ ఇంటివద్ద భారీగా బలగాలను మోహరించి భద్రత కల్పించారు. అయినా.. రెండోరోజు కూడా కౌశిక్‌రెడ్డి, గాంధీ మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు కొనసాగాయి. తాను బీఆర్ఎసలోనే ఉన్నానంటున్న గాంధీ ఇంటికి వెళ్లి ఆయనకు పార్టీ కండువా కప్పుతానని, ఆయన ఇంటిపై పార్టీ జెండాను ఎగురవేస్తానని కౌశిక్‌రెడ్డి ప్రకటించడంతో గురువారం ఇరువురి మధ్య రగడ మొదలైన విషయం తెలిసిందే. కౌశిక్‌రెడ్డి తన ఇంటికి రాకపోతే తానే ఆయన ఇంటికి వెళతానంటూ గాంధీ తన అనుచరులు, కార్యకర్తలతో కలిసి కొండాపూర్‌లోని కౌశిక్ ఇంటికి వెళ్లడంతో జరిగిన ఘర్షణ ఉద్రిక్తతకు కారణమైంది.

**కౌశిక్‌రెడ్డి, శంభీపూర్ రాజు హౌస్ అరెస్ట్..**

ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు ఆధ్వర్యంలో కార్యకర్తలతో కలిసి గాంధీకి ఇంటికి వెళ్తామని, అక్కడ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహిస్తామని కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో స్థానిక పోలీసులు అప్రమత్తమయ్యారు. దుండిగల్ మునిసిపాలిటీ శంభీపూర్‌లోని రాజు ఇంటి వద్ద మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి పర్యవేక్షణలో శుక్రవారం ఉదయం నుంచే భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ విధించి ఆయన ఇంటివద్దకు బీఆర్ఎస్ నాయకులు రాకుండా కట్టడి చేశారు. అయినప్పటికీ ఉదయం 10.30 గంటలకు కౌశిక్‌రెడ్డి.. శంభీపూర్‌రాజు ఇంట్లో ప్రత్యక్షమయ్యారు. వాస్తవానికి కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి నివాసం వద్ద కూడా పోలీసులు భారీగా మోహరించి ఆయన బయటికి రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే.. కౌశిక్‌రెడ్డి గురువారం అర్ధరాత్రే పోలీసుల కళ్లుగప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయినట్లు, తెల్లవారుజామునే శంభీపూర్ రాజు ఇంటికి వచ్చి అక్కడే నిద్రించినట్లు తెలిసింది. కాగా, శుక్రవారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో శంభీపూర్ రాజు, కౌశిక్‌రెడ్డితోపాటు కొంతమంది నాయకులు, కార్యకర్తలు గాంధీ ఇంటికి బయలు దేరేందుకు ప్రయత్నించగా.. పోలీసులు గేటు లోపలనే ఇరువురిని అదుపులోకి తీసుకుని హౌస్ అరెస్ట్ చేశారు.

**ఎమ్మెల్యేలు, నేతల అరెస్టులు..**

గ్రేటర్ హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులను కూడా పోలీసులు ఎక్కడికక్కడ అరెస్ట్ చేశారు. ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, మాగంటి గోపీనాథ్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, మల్లారెడ్డి, తలసాని శ్రీనివాసయాదవ్, బండారి లక్ష్మారెడ్డిలను వారి నివాసాల్లో గృహనిర్బంధం చేశారు. వారితోపాటు ఇతర ముఖ్యనేతలను బీఆర్ఎస్ కార్పొరేటర్లను కూడా ఎక్కడికక్కడ హౌస్ అరెస్టు చేశారు. పరిగిలో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డిని, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. కాగా, అరికెపూడి గాంధీపై చర్యలు తీసుకోవాలంటూ సిరిసిల్లలో చేనేత చౌక్ వద్ద బీఆర్ఎస్వీ నాయకులు ధర్నా నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో గోదావరిఖనిలోని గోదావరి బ్రిడ్జిపై రాస్తారోకో చేశారు. ఓదెల మండలంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్‌ను పార్టీ కార్యాలయంలో నిర్బంధించారు.

**పోలీస్ భద్రత నడుమ ఆస్పత్రికి హరీశ్‌రావు**

కోకాపేట్‌లోని తన నివాసంలో హౌస్ అరెస్టయిన బీఆర్ఎస్ కీలక నేత హరీశ్‌రావు శుక్రవారం ఆస్పత్రికి కూడా పోలీసుల భద్రత నడుమ వెళ్లాల్సివచ్చింది. గురువారం సైబరాబాద్ కమిషనరేట్ నుంచి ఇతర బీఆర్ఎస్ నాయకులతోపాటు హరీశ్‌రావును అరెస్టు చేసి తరలించే క్రమంలో ఆయన భుజానికి గాయమైనట్లు తెలిసింది. దీనికి తాను చికిత్స తీసుకోవాలని హరీశ్‌రావు పోలీసులకు చెప్పడంతో వారే ఆయనను వెంటబెట్టుకొని గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి తరలించారు. వారి భద్రత నడమనే హరీశ్‌రావుకు చికిత్స అందించారు. అంతకుముందు హరీశ్‌రావును కలిసేందుకు ఆయన నివాసానికి వచ్చిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ మాలోతు కవితను పోలీసులు అడ్డుకున్నారు. వారిని అరెస్ట్ చేసి పోలీసస్టేషన్‌కు తరలించారు.

**కౌశిక్‌రెడ్డిని సస్పెండ్ చేయాలి: దానం**

కౌశిక్‌రెడ్డి చేసిన ఆంధ్ర, తెలంగాణ వ్యాఖ్యలను తాము చాలా సీరియస్‌గా తీసుకుంటామని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. కౌశిక్‌రెడ్డిని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం అరికెపూడి గాంధీకి మద్దతుగా నాగేందర్ ఆయన ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌశిక్‌రెడ్డిని కంట్రోల్ చేయాల్సిన బాధ్యత బీఆర్ఎస్ సీనియర్ నాయకుడైన హరీశ్‌రావుకు ఉందన్నారు. ఆయనకు చేతకాకుంటే ఎలా కంట్రోల్ చేయాలో తమకు తెలుసునన్నారు. మరోవైపు జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ కూడా గాంధీకి మద్దతుగా ఆయన ఇంటికి వచ్చారు. మీడియాలో పబ్లిసిటీ కోసమే కౌశిక్‌రెడ్డి డ్రామాలు చేస్తున్నాడని ఆయన అన్నారు. ప్లాన్ ప్రకారమే బీఆర్ఎస్ ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తోందని, నగరాభివృద్ధిని అడ్డుకోవడమే బీఆర్ఎస్ లక్ష్యంగా కనిపిస్తోందని ఆరోపించారు.

**ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఇంటి వద్ద మూడంచెల భద్రత..**

ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఇంటి వద్ద కూడా ఉదయం నుంచే పోలీసులు భారీ భద్రత కల్పించారు. బాలానగర్ డీసీపీ సురేషకుమార్ ఆధ్వర్యంలో 200 మంది పోలీసులతో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. గాంధీ ఇంటికి వెళ్లే అన్ని రహదారులను మూసి వేశారు. కేవలం ఆ కాలనీలో నివాసముండే వారిని మాత్రమే అనుమతించారు. మధ్యాహ్నం సమయంలో వివేకానందనగర్ డివిజన్‌కు చెందిన కొంతమంది బీఆర్ఎస్ నాయకులు గాంధీ ఇంటిని ముట్టడించేందుకు ప్రయత్నించగా.. పోలీసులు అప్రమత్తమై వారిని అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు గాంధీ ఇంటి ముట్టడికి బీఆర్ఎస్ నాయకులు వచ్చిన విషయం తెలుసుకున్న ఆయన అభిమానులు ఒక్కసారిగా వారి వద్దకు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు అడ్డుకుని వారిని శాంతింపజేశారు. ఇదిలా ఉండగా.. కౌశిక్‌రెడ్డితో కలిసి తన ఇంటికి వస్తానన్న బీఆర్ఎస్ నాయకుల కోసమంటూ గాంధీ తన నివాసంలో ఉదయం పూట కుర్చీలు వేసి వారికి టిఫిన్లు ఏర్పాటు చేశారు.

## నా ఇంటిపై జెండా ఎగరేసేందుకు కౌశిక్ ఎవడు?: గాంధీ

కౌశిక్‌రెడ్డిపై తాను నోరు జారింది వాస్తవమేనని ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. అయితే కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ప్రతిగానే తాను అలా పరుష పదజాలంతో మాట్లాడాల్సి వచ్చిందన్నారు. కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు తనను బాధించాయన్నారు. తన ఇంటిపై జెండా ఎగరేసేందుకు కౌశిక్‌రెడ్డి ఎవరని ప్రశ్నించారు. మహిళా గవర్నర్‌ను అవమానించిన చరిత్ర అతనిదని అన్నారు. చీర, గాజుల గురించి మాట్లాడి తల్లి, చెల్లి, భార్యను అవమానించాడని, ప్రాంతీయ విబేధాలు తీసుకొచ్చాడని మండిపడ్డారు. అతడి మాటలతో ఆంధ్రవాళ్ల మనోభావాలు దెబ్బతిన్నాయని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఏపీలో బీఆర్ఎస్ పార్టీ పెట్టినప్పుడు మీకు ప్రాంతాలు గుర్తుకు రాలేదా? అని నిలదీశారు. తెలంగాణ రాష్ట్రం ఏమైనా కౌశిక్‌రెడ్డి అయ్య జాగీరా? అని ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డి వ్యవహారశైలి కారణంగా బీఆర్ఎసకు, కేసీఆర్‌కు మచ్చ వస్తుందని, అతని లాంటి వారితోనే బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోయిందని ఆరోపించారు. "బ్రోకర్, కోవర్టును ఊరు మీద కు వదిలారు. అమెరికా నుంచి ఫోన్‌లో హెచ్చరికలు రావడంతోనే ఈ రోజు తగ్గి మాట్లాడాడు. నా భాష గురించి మాట్లాడుతున్న హరీశ్‌రావు గతంలో ప్రభుత్వ అధికారులైన ఐఏఎస్, ఐపీఎసలపై మాట్లాడిన మాటలను గుర్తు చేసుకోవాలి" అని అన్నారు. తాను ఏ పార్టీలో ఉన్నాననే దానిపై స్పీకర్ క్లారిటీ ఇచ్చారని తెలిపారు.

# తెలుగు ప్రజలకు ప్రధాని చవితి కానుక

మొదటి పేజీ తరువాయి
దాటిన వయో వృద్ధులందరికీ.. ఈ పథకం కోసం ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఇప్పటికే ఆయుష్మాన్ పరిధిలో ఉన్న కుటుంబాల్లోని 70 ఏళ్లు దాటిన వయోవృద్ధులకు అదనంగా ఏడాదికి రూ.5లక్షల టాప్-అప్ కవర్ ఇవ్వనుంది. కేంద్రం నిర్ణయంతో.. వయోవృద్ధుల్లో హర్షం నెలకొంది. వయోవృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న ప్రధాని మోదీకి కృతజ్ఞతలని కిషన్‌రెడ్డి తెలిపారు.

**విమోచన ఉత్సవానికి అతిథిగా కిషన్‌రెడ్డి**

ఈ నెల 17న పరేడ్ గ్రౌండ్ వేదికగా కేంద్ర ప్రభుత్వం నిర్వహించనున్న తెలంగాణ విమోచన దినోత్సవానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఆ రోజున కిషన్‌రెడ్డి.. జాతీయ జెండాను ఆవిష్కరించి సైనిక వందనం స్వీకరిస్తారు. గడచిన రెండు సార్లు కేంద్రం నిర్వహించిన ఈ వేడుకలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

# జైల్లో పెట్టి వేధించాలని చూశారు

న్యూఢిల్లీ,సెప్టెంబర్13 : ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తిహార్ జైలు నుంచి విడుదలయ్యారు. ఢిల్లీ మద్యం విధానం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలతో అరెస్టయిన ఆయనకు శుక్రవారం సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. అనంతరం విడుదలకు అవసరమైన పక్రియ పూర్తి కావడంతో బెయిలు మంజూరైన కొన్ని గంటల వ్యవధిలోనే ఆయన జైలు నుంచి బయటకు వచ్చారు. ఆప్ శ్రేణులు, కేజ్రీవాల్ అభిమానులు జైలు వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకొని ఆయనకు స్వాగతం పలికారు. వర్షం కురుస్తుండగా.. తనకు స్వాగతం పలికేందుకు వచ్చిన వారందరికీ కేజ్రీవాల్
అభివాదం చేస్తూ కనిపించారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడుతూ.. ఇంత వర్షంలోనూ పెద్ద సంఖ్యలో వచ్చినందుకు మీ అందరికీ ధన్యవాదాలు. నా జీవితం దేశానికే అంకితం. లైఫ్‌లో ఎన్నో ఇబ్బందులు, కష్టాలు ఎదుర్కొన్నా. సత్యమార్గంలోనే నడిచినందు వల్లే దేవుడి ఆశీస్సులు ఉన్నాయి. నన్ను జైలులో పెట్టి మనో ధైర్యాన్ని దెబ్బతీద్దామని కొందరు అనుకున్నారు. కానీ, నేను జైలు నుంచి బయటకు వచ్చాక నా మనోధైర్యం వందరెట్లు పెరిగింది. భగవంతుడు చూపిన మార్గంలోనే నడుస్తూ.. దేశానికి సేవ చేస్తూనే ఉంటాను. దేశాన్ని విభజించేందుకు ప్రయత్నించే శక్తులపై పోరాటం కొనసాగిస్తాను' అని తెలిపారు. కేజ్రీవాల్‌కు స్వాగతం పలికేందుకు జైలుకు వచ్చిన వారిలో ఆయన సతీమణి సునీతా కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవత్ మాన్, ఢిల్లీ మంత్రి అతిశీ, మాజీ మంత్రి మనీశ్ సిసోదియా తదితరులు ఉన్నారు.

# పోర్ట్ బ్లెయిర్ ఇక శ్రీవిజయపురం

న్యూఢిల్లీ,సెప్టెంబర్13 : అండమాన్ నికోబార్ దీవుల రాజధాని పోర్ట్ బ్లెయిర్ పేరును కేంద్ర ప్రభుత్వం మార్చింది. ఇకపై దానిని శ్రీ విజయపురంగా వ్యవహరించాలని నిర్ణయించింది. వలసవాద ఆనవాళ్ల నుంచి బయటపడేందుకు ఈ పేరును మార్చినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. వలసవాద గుర్తుల నుంచి దేశానికి విముక్తి కల్పించాలన్న ప్రధాని మోదీ ఆశయాలకు అనుగుణంగా పోర్ట్ బ్లెయిర్ పేరును శ్రీ విజయపురంగా మార్చాలని నిర్ణయించాం. మునుపటి పేరు వలసవాద వారసత్వాన్ని సూచిస్తోంది. శ్రీ విజయపురం అనేది భారత స్వాతంత్య్ర పోరాటంలో సాధించిన విజయానికి ప్రతీక. నాటి పోరాటంలో అండమాన్ నికోబార్ పాత్ర ఎంతో ప్రత్యేకంఅని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. చరిత్రతో పాటు స్వాతంత్య్ర పోరాటంలోనూ అండమాన్ నికోబార్ దీవులది కీలక పాత్ర అని అమిత్ షా పేర్కొన్నారు. చోళ సామ్రాజ్యంలో నౌకదళ స్థావరంగా ఉన్న ఈ భూభాగం.. ప్రస్తుతం మన దేశ వ్యూహాత్మక, అభివృద్ధి ఆశయాలకు కీలక కేంద్రంగా పని చేస్తోందన్నారు. మన జాతీయ పతాకాన్ని మొట్టమొదటిసారిగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఇక్కడే ఎగరవేశారని గుర్తుచేశారు. వీర్ సావర్కర్‌తో పాటు అనేకమంది స్వాతంత్య్ర సమరయోధులను బంధించిన సెల్యూలర్ జైలు కూడా ఇక్కడే ఉందన్నారు.

# తెలంగాణలో శాంతిభద్రతలు కరువు



మొదటి పేజీ తరువాయి
చేయించింది ఎవరు ..? రేవంత్ రెడ్డి, డీజీపీలు కాదా ..? నిన్నటి దాడులు ఎందుకు ఆపలేదు. అది గాంధీ చేసిన దాడి కాదు రేవంత్ రెడ్డి చేసిన దాడి. మమ్మల్ని ఇవాళ హౌజ్ అరెస్ట్ చేశారు. నిన్న గాంధీని ఎందుకు హౌజ్ అరెస్టు చేయలేదు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఉందా. ఖమ్మంలో మా మీద దాడి చేస్తే పది రోజులైనా గుండాల మీద కేసులు పెట్టలేదు. నిన్న జరిగిన దాడికి కర్త,కర్మ, క్రియ అంతా రేవంత్ రెడ్డే. ఆయన డైరెక్షన్ లో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి జరిగింది. ఎమ్జ్గ్గ÷న్సీ కన్నా దారుణంగా రాష్ట్ర పరిస్థితులు తయారయ్యాయి.కోమటి రెడ్డి వెంకటరెడ్డి రెచ్చగొట్టే విధంగా మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలను కొట్టాలని చెప్పడం దారుణం. ఫిరాయింపులపై ఢిల్లీలో ఒక మాట గల్లీలో ఒక మాట మాట్లాడుతున్నాడు. ఎన్నిక లేకున్నా పీఏసీ చైర్మన్ ను నియమించి ఎన్నిక జరిగిందని రేవంత్ రెడ్డి చెప్పడం దుర్మార్గం. డీజీపీ పదవి చాలా ఉన్నతమైంది. ఆదర్శంగా ఉండాల్సిన డీజీపీ.. రాజకీయ కుట్రలో భాగమై ప్రతిపక్షాల గొంతును నొక్కాలని చూడాలను కుంటున్నారు. రాహుల్ గాంధీ దేశం బయట స్వేచ్ఛ స్వాతంత్ర్యాల గురించి పాఠాలు చెప్పడం కాదు. తెలంగాణలో ఏం జరుగుతుందో చూడాలన్నారు. ఃాజ్యాంగ హక్కులను ఉల్లంఘించి పార్టీ ఫిరాయింపులు జరిగాయి. పీఏసీ చైర్మన్ నియామకం కూడా అలాగే జరిగింది. మీరు మాపై విసిరే రాళ్లే అధికారంలోకి బీఆర్ఎస్ రావడానికి
పునాది రాళ్లు. 16వ ఆర్థిక సంఘం గురించి మీరు తప్పుడు లెక్కలు చెబితే, మేము బాధ్యతాయుతంగా బలమైన వాదనను వినిపించాం. ఆంధ్రా నాయకుల మీద రేవంత్ రెడ్డి కపట ప్రేమ వలకబోస్తున్నారు. చిన్న జీయర్ స్వామిని, యాదాద్రి నిర్మాణానికి ప్లాన్ ఇచ్చిన ఆనంద సాయిని ఆంధ్రోడు అని రేవంత్ అన్నారు. మరి దానికి ఏమని సమాధానం చెబుతారు. పీఏసీ చైర్మన్ పదవికి ఎన్నిక జరిగిందని రేవంత్ రెడ్డి చెప్పడం హాస్యాస్పదం. ఎలక్షన్ కాదు, సెలక్షన్ ద్వారా ఇది జరిగింది. కరీంనగర్ నుంచి వచ్చి హైదరాబాద్‌లో నీ పెత్తనం ఏంటని అరికెపూడి గాంధీ.. కౌశిక్ రెడ్డిని ప్రశ్నించారు. దానికి సమాధానంగానే కౌశిక్ రెడ్డి మాట్లాడారు తప్పా? సెటిలర్ల మీద కౌశిక్ కామెంట్ చేయలేదు. ముందు రెచ్చగొట్టింది గాంధీ. ఆయనకు చెప్పిన సమాధానం అది'అని హరీశ్ రావు తెలిపారు. గురువారం జరిగిన తొక్కిసలాటతో తనకు భుజం నొప్పి మొదలైందని.. డాక్టర్లు ఎమ్మారై స్కాన్ తీసి 15 రోజుల పాటు ఫిజియోథెరపీ సూచించారని హరీశ్ వివరించారు.

# అందరికీ విద్య ,ఉపాధి కల్పనకై ఉద్యమించాలి


## ప్రముఖ జర్నలిస్టు, ఆర్థిక విశ్లేషకులు పాపారావు




కరీంనగర్-జనత న్యూస్ : అందరికీ విద్య, ఉపాధి అవకాశాల కల్పనకు ఉద్యమించాలని ప్రముఖ జర్నలిస్టు, ఆర్థిక విశ్లేషకులు పాపారావు పిలుపునిచ్చారు. కరీంనగర్‌లో భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ), తెలంగాణ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాలు జరిగాయి. యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ రవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాలకు ముఖ్య అతిథులుగా ప్రముఖ జర్నలిస్ట్ పాపారావు, అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి, సాహితి జూనియర్ కాలేజ్ చైర్మన్ ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ..రాష్ట్రంలో విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు అన్ని వర్గాలు కృష చేయాలని కోరారు. దేశంలో ప్రభుత్వ విద్యారంగం సంక్షోభంలో ఉందని అన్నారు. ప్రతిపక్ష పార్టీలపై దాడులు, కేంద్ర సంస్థల దుర్వినియోగం, ధనబలంతో ఈ ఎన్నికలు జరిగాయన్నారు. ఎన్నికల సంఘం ఏకపక్షంగా వ్యవహరించిందని, ముందు ఇద్దరు ముఖ్యమంత్రులు జైలు పాలయ్యారని ఆరోపించారు. విద్యా పరిరక్షణకై ఉద్యమిద్దామని యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు తాటికొండ రవి, మాదం తిరుపతి విద్యార్థులకు పిలుపునిచ్చారు. నూతన విద్యాసంవత్సరానికి సంబంధించి పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ అందించడంలో గందరగోళం నెలకొందన్నారు. రాష్ట్రంలో ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలు, గురుకులాలు,ఆదర్శ పాఠశాలలు, ప్రభుత్వ హైస్కూళ్లలో టాయిలెట్స్, మంచినీరు వంటి సమస్య బాగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు వివిఆర్, మధు, రాజేష్, సూరి, సహా కార్యదర్శిలు నగేష్, రంగస్వామి, వీరబాబు, వెంకటేష్, తిరుపతి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాహుల్ గణేష్ నాయకులు నీలిమ, అనురాధ, శేఖర్ , సురేష్, నాగరాజు, మహేష్ పాల్గొన్నారు.

## విప్‌కు రక్తంతో గీసిన చిత్రం అందజేత





రుద్రంగి-జనత న్యూస్ : రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రానికి చెందిన తోకల అనిల్ అనే యువకుడు తన రక్తంతో గీయించిన చిత్రాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు అందజేసి అభిమానాన్ని చాటాడు. ఆది శీనివాస్ కు చిత్రపటాన్ని బహుకరించడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన అనిల్..తన అభిమాన నాయకుడుకి ఈ చిత్రాన్ని అందజేయడం అనుభూతి కల్గించిందన్నారు.

## చిత్తూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

### బస్సు, రెండు లారీలు ఢీ కొన్న ఘటనలో 8మంది మృతి

### తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం చంద్రబాబు




చిత్తూరు,సెప్టెంబర్ 13 : చిత్తూరు జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బంగారుపాళ్యం మండలం మొగలి కనుమరహదారిలో బస్సు, రెండు లారీలు ఢీ కొన్న ఘటనలో ఎనిమిది మంది ఘటనా స్థలంలోనే మృతి చెందారు. మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. చిత్తూరు వైపు నుంచి పలమనేరు వెళుతున్న ఆర్టీసీ బస్సును పలమనేరు వైపు నుంచి ఐరన్ లోడుతో వస్తున్న లారీ ఢీ కొట్టడంతో ఈ దుర్ఘటన చేసుకుంది. కనుమ రహదారిలో మితిమీరిన వేగంతో వస్తున్న లారీ అదుపు తప్పి పక్క రోడ్డులో ఎదురుగా వస్తున్న బస్సు పైకి దూసుకెళ్లింది. ఘటనలో ఆర్టీసీ డ్రైవర్ తో పాటు ఎనిమిది మంది మృత్యవాత పడ్డారు. మరో 30 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను పలమనేరు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. మొగలి కనుమదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆరా తీసిన సీఎం.. సహాయక చర్యలు, బాధితులకు అందుతున్న వైద్య సాయంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

# సీఎం సహాయనిధికి విరాళాల వెల్లువ

### సీఎం రేవంత్‌ను కలిసి చెక్కులు అందచేత



హైదరాబాద్,సెప్టెంబర్ 13 : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని పలువురు కలిసి వరదసాయంపై తమవంతుగ ఆచెక్కులను అందచేశారు హిందూపూర్ టీడీపీ ఎమ్మెల్యే, హీరో బాలకృష్ణ చిన్న కుమార్తె తండ్రి తరపున 50 లక్షల చెక్కును అందించారు. శుక్రవారం మధ్యాహ్నం.. బాలయ్య కుమార్తె తేజస్విని.. జూబ్లీహిల్స్ లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి వచ్చారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో వరదలు వచ్చాయి. బాధితులకు అండగా 50 లక్షల రూపాయల విరాళం ప్రకటించారు బాలకృష్ణ. ఈ మేరకు ఆ వరద సాయం చెక్కును.. సీఎం రేవంత్ రెడ్డిని కలిసి తేజస్విని స్వయంగా అందించారు. నాన్న తరపున ఈ సాయం అందించినట్లు స్పష్టం చేశారు. తెలంగాణతో పాటు ఏపీకి కూడా 50 లక్షల సాయం ప్రకటించారు బాలయ్య. ఇదిలావుంటే ముఖ్యమంత్రి సహాయనిధికి ఎఎంఆర్ ఇండియా కంపెనీ రూ.కోటి విరాళంగా అందించింది. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కంపెనీ ఎండీ మహేష్ కుమార్ రెడ్డి చెక్ ను అందజేసారు. ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.50 లక్షలు విరాళంగా వాక్సెన్ యూనివర్సిటీ అందించింది. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రిని కలిసిన యూనివర్సిటీ వ్యవస్థాపకులు ప్రవీణ్ కె పూల చెక్ ను అందజేసారు. ముఖ్యమంత్రి సహాయనిధికి వెస్టర్న్ కన్‌స్ట్రక్షన్ రూ.కోటి విరాళంగా అందించింది. సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి చెక్‌ను ఆర్.సుదర్శన్ రెడ్డి, ఏ.పీ. సంజయ్ రెడ్డిలు అందజేసారు. ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.5 కోట్లు విరాళంగా డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ అందించేసింది. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వి. నారాయణరెడ్డి చెక్‌ను అందజేసారు. మంత్రి పొంగులేని శ్రీనివాసులరెడ్డి, మరో సీనియర్ నేత జితేందర్ రెడ్డి సైతం ఈ సమావేశంలో ఉన్నారు.

**శాంతిభద్రతలపై రాజీ ప్రసక్తి లేదు**

**ప్రభుత్వాన్ని అస్థిర పరచే కుట్రలో బిఆర్ఎస్**

**శాంతిభద్రతలపై కఠినంగా ఉండాల్సిదే**

**డిజిపికి సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు**

ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, అరికెపూడి గాంధీ మధ్య వివాదం తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీస్తుండడంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 3 రోజులుగా ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితులపై స్పందించారు. అధికారం కొల్పోయామనే అక్కసుతో కొందరు కొందరు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని మండిపడ్డారు. లా అండ్ ఆర్డర్ విషయంలో ఇబ్బంది కలిగిస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీ జితేందర్‌ను ఆదేశించారు. రాజకీయ కుట్రలు సహించేది లేదని.. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీసే పనిలో బీఆర్ఎస్ ఉందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని ట్రై కమిషనరేట్లలో శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని.. లా అండ్ ఆర్డర్‌కు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా ఉపేక్షించొద్దని డీజీపీ పోలీసులను ఆదేశించారు. ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, అరికెపూడి గాంధీ వివాదాన్ని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ సీపీలతో ఆయన సమావేశం నిర్వహించారు. హైదరాబాద్, తెలంగాణలో పరిస్థితిని చెడగొట్టేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవద్దని.. రాష్ట్ర ప్రతిష్టను ఎట్టిపరిస్థితుల్లోనూ కాపాడాలని అన్నారు.కాగా, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, అరికెపూడి గాంధీ మధ్య తలెత్తిన వివాదం క్రమంలో గురువారం నుంచి నగరంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. గురువారం పాడి కౌశిక్ రెడ్డి ఇంటిపై గాంధీ అనుచరులు దాడికి పాల్పడగా.. బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు భారీగా మోహరించారు. బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశానికి పిలుపునిచ్చిన క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు సహా ఇతర నేతలను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. హైదరాబాద్ కోకాపేటలోని హరీష్ నివాసం వద్ద పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రజలను సైతం ఎవరినీ కలవనీయడం లేదు. హరీష్ రావును కలిసేందుకు వచ్చిన ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ మాలోతు కవితను సైతం అడ్డుకున్నారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల విషయంలో స్పీకర్ రాజ్యాంగబద్ధంగానే వ్యవహరిస్తారని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'మా ప్రభుత్వం మొదలైనప్పటి నుంచి పడగొడతామని బీఆర్ఎస్, బీజేపీలు పదేపదే చెప్పాయి. అయితే, కేసీఆర్ లక్కీ నెంబర్ మా దగ్గర ఉన్నందున ప్రభుత్వానికేమీ ఢోకా లేదు. ఉప ఎన్నికలొస్తాయని బీఆర్ఎస్ మైండ్ గేమ్ ఆడేందుకు యత్నిస్తోంది. కేసీఆర్ కోసం కొత్త రాజ్యాంగమేమీ ఉండదు. ప్రభుత్వం చేసే మంచి పనుల గురించి మాట్లాడకుండా తొలిరోజు నుంచే ప్రభుత్వం కూలిపోతుందని మాట్లాడుతున్నారు. మేం నిబంధనల ప్రకారమే నడుచుకున్నాం.' అని రేవంత్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేలా రకరకాల కుట్రలకు తెరలేపుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడే విషయంలో సీరియస్‌గా వ్యవహరించాలని డీజీపీకి సూచించారు. తాజాగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు పోలీసులు షాక్ ఇచ్చారు. పాడి కౌశిక్ రెడ్డిపై కేసు నమోదు చేశారు. అడిషనల్ ఎస్పీ రవి చందన్ ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశారు. పోలీసుల విధులకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆటంకం కలిగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు.

# ముగింపు దశకు చేరుకున్న గణేష్ ఉత్సవాలు



### 25వేలమంది పోలీసులతో నిమజ్జన బందోబస్తు

### 17న నిమజ్జనానికి భారీగా ఏర్పాట్లు

### 1.30 గంటలకల్లా ఖైరతాబాద్ గణేశుడి నిమజ్జనం

### అధికారులతో సమీక్షించిన సిపి సివి ఆనంద్

హైదరాబాద్,సెప్టెంబర్ 13 : నగరంలో గణెశిశ్ నిమజ్జనం సందర్భంగా 25వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఇప్పటికే అన్నిశాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళు_న్నామని చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఖైరతాబాద్ మహాగణపతిని మధ్యాహ్నం 1.30 గంటల్లోపు నిమజ్జనం చేసేలా నిర్వాహకులతో చర్చించామని.. దానికి వాళ్లు అంగీకరించారని తెలిపారు. నగర వ్యాప్తంగా అన్ని రకాల విగ్రహాలు కలిపి సుమారు లక్ష వరకు ఉండొచ్చన్నారు. 17న వేల సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనం కానున్నాయన్నారు. తిలకించేందుకు పెద్ద ఎత్తున నగరవాసులు హుస్సేన్‌సాగర్ పరిసరాలకు వస్తారని చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని సీపీ వివరించారు. ఇకపోతే గణెలిష్ ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఇప్పటికే అనేక వినాయక విగ్రహాలు నిమజ్జనం అయ్యాయి. ఈనెల 17న ఖైరతాబాద్ మహాగణపతితో పాటు పెద్ద సంఖ్యలో వినాయాక విగ్రహాలు నిమజ్జనాలు జరగనున్నాయి. ఇందుకోసం పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సందర్భంగా గణెలిష్ నిమజ్జనం ఏర్పాట్లపై హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ... గణెలిష్ నిమజ్జనానికి 25 వేల మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో గణెలిష్ నిమజ్జనం జరుగుతుందన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఖైరతాబాద్ గణెలిష్ నిమజ్జనం మధ్యాహ్నం 1:30 గంటలలోపు పూర్తి అవుతుందని తెలిపారు. ఈ ఏడాది అదనంగా 10 శాతం వినాయక విగ్రహాలు ఏర్పాటు అయ్యాయన్నారు. అన్నిరకాల విగ్రహాలు కలిపి దాదాపు లక్ష వరకు ఉండొచ్చన్నారు. నాలుగు రోజులుగా హుస్సేన్‌సాగర్‌లో వినాయక నిమజ్జనాలు జరుగుతున్నాయన్నారు. ఈ నెల 17న వేల సంఖ్యలో వినాయక విగ్రహాల నిమజ్జనం అవుతాయని సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. గణెలిష్ నిమజ్జన శోభాయాత్రల నేపథ్యంలో హైదరాబాద్ సిటీ పోలీసులు శుక్రవారం కీలక నిబంధనలు ప్రకటించారు. నిమజ్జనం రోజున పాటించాల్సిన ముందస్తు నియమాలను వెల్లడించారు. గణెలిష్ ఉత్సవ కమిటీ సభ్యులు విగ్రహాలను తీసుకెళ్లడానికి అవసరమైన వాహనాన్ని ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిమజ్జనం రోజున సౌత్ జోన్ పరిధుల నుంచి విగ్రహాలను తీసుకెళ్లేవారు ముందుగానే బయలుదేరాలని, వాహనానికి ఏసీపీ కేటాయించిన నంబర్‌ను ప్రదర్శించాలని తెలిపారు. ఇకపోతే ఒక గణెలిష్ విగ్రహానికి ఒక వాహనం మాత్రమే అనుమతి ఉంటుంది.విగ్రహాన్ని తీసుకెళ్లే వాహనంపై లౌడ్ స్పీకర్‌ను అమర్చకూడదు. నిమజ్జనం రోజు వాహనాలపై డీజేతో కూడిన మ్యూజికల్ సిస్టమ్‌కు అనుమతి లేదు. రంగులు చల్లుకునేందుకు కాన్ఫెట్టి తుపాకులను ఉపయోగించకూడదు. విగ్రహాన్ని తీసుకెళ్లే వాహనంలో మద్యం లేదా మరేదైనా మత్తుమందులు సేవించిన వ్యక్తులకు అనుమతి ఉండదు. రోడ్డుపై వాహనం వెళ్లేటప్పుడు ట్రాఫిక్‌ను ప్రభావితం చేయకూడదు. ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించకూడదు విగ్రహాన్ని తీసుకెళ్లే వాహనం ఇతర వాహనాలకు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ఏదైనా ప్రార్థనా స్థలం దగ్గర లేదా మార్గంలో ఆపకూడదు. అప్పటి పరిస్థితులను బట్టి పోలీసు అధికారులు ఇచ్చే ఆదేశాల మేరకు వాహనాల కదలికలు ఆధారపడి ఉంటాయి.ఊరేగింపులో ఎవరూ కర్రలు/కత్తులు, కాల్పులు ఆయుధాలు, మండే పదార్థాలు లేదా ఇతర ఆయుధాలను తీసుకెళ్లకూడదు.

జెండాలు లేదా అలంకారాల కోసం ఉపయోగించే కర్రలు 2 అడుగుల కంటే ఎక్కువ పొడవు ఉండకూడదు. వెర్మిలియన్, కుంకుమ లేదా గులాల్‌లను బాటసారులపై వేయకూడదు. ఊరేగింపులో ఎలాంటి రాజకీయ ప్రసంగాలు/రెచ్చగొట్టే ప్రసంగాలు/నినాదాలు లేదా రెచ్చగొట్టే సంకేతాలు లేదా బ్యానర్లు ఉపయోగించకూడదు. జనాలలో ఏ వర్గానికి చెందిన వారి మనోభావాలను దెబ్బతీసే ఇతర రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకూడదు. ఊరేగింపు సమయంలో బాణాసంచా ఉపయోగించకూడదు. పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు ఇచ్చే సూచనలను పాటించాలి. ఏదైనా అత్యవసర పరిస్థితి ఉంటే 100కి డయల్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

# జిఎస్టీ గురించి అడిగతే బెదిరింపులా?

### తమిళనాడు రెస్టారెంట్ యజమాని క్షమాపణలు

### నిర్మలా సీతారామన్ తీరుపై మండిపడ్డ ఖర్గే

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 13 : ఆహార పదార్థాలపై జీఎస్టీ విషయంలో తమిళనాడుకు చెందిన 'శ్రీ అన్నపూర్ణ రెస్టారెంట్' యజమాని శ్రీనివాసన్ ఇటీవల ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న జీఎస్టీ గురించి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ప్రశ్నించారు. రెస్టారెంట్లు ఎదుర్కొంటున్న సవాళ్లను తెలియజేశారు. అనంతరం ఓ ప్రైవేటు కార్యక్రమంలో ఆయన ఆర్థిక మంత్రిని కలిసి క్షమాపణలు చెప్పిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది. సదరు వ్యక్తిపై కేంద్ర ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడిందని, ఇందుకు గాను సీతారామన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తోంది. ఈ ఘటనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందించారు. అన్నపూర్ణ రెస్టారెంట్ చైన్ యజమాని వ్యవహారంలో నిర్మలా సీతారామన్ తీరు అవమానకరమైనది. పేద మధ్యతరగతి వర్గాల పట్ల జీఎస్టీ పన్ను భూతంలా మారింది. మోదీ ప్రభుత్వ చర్యలతో చిన్న వ్యాపారాల యజమానులు ఆర్థిక దాడులకు గురవుతున్నారు. అధికార అహంకారంతో వారీ విధంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. వస్తువులపై సరళమైన, ఏకరీతి, హేతుబద్ధమైన జీఎస్టీ అవసరమని కాంగ్రెస్ ముందు నుంచి చెబుతోందన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ విషయంపై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తన బిలియనీర్ స్నేహితులు నిబంధనలను వక్రీకరించడానికి, చట్టాలను మార్చడానికి, జాతీయ ఆస్తులను సొంతం చేసుకోవడానికి ప్రయత్నించినప్పుడు ప్రధాని వారికి రెడ్ కార్పెట్ పరుస్తారు. చిన్న వ్యాపారులు మాత్రం నోట్ల రద్దులు, పన్ను దోపిడులు, జీఎస్టీలను ఎదుర్కొంటున్నారు. చివరికి అవమానాలు కూడా వారికే అంటూ దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనాథే మాట్లాడుతూ భాజపా తన సభ్యత డ్రైవ్‌లో భాగంగా ఓ సమావేశాన్ని నిర్వహించింది. అన్ని వర్గాల వారిని ఆహ్వానించి మరీ అవమానపరిచారు. భాజపా తమిళనాడు అధికారిక హ్యాండిల్ రెండు వీడియోలను రహస్యంగా రికార్డ్ చేసి షేర్ చేశారు. ఇది వారిని అవమానించినట్లే ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వాధి కారులకు చెప్పుకోకపోతే వారికి కావలసిన విధానపరమైన రూపకల్పనలు ఎలా జరుగుతాయని ప్రశ్నించారు. ఈ వీడియోపై తీవ్ర వ్యతిరేకత వస్తుండటంతో తమిళనాడు భాజపా చీఫ్ కె అన్నామలై బహిరంగ క్షమాపణలు చెప్పారు.

# ప్రాక్టీస్ ప్రారంభించిన టీమిండియా

## భారత ఆటగాళ్ల ముమ్మర కసరత్తు

## చెన్నై చేరుకున్న రోహిత్, విరాట్





చెన్నై: స్వదేశంలో సుమారు ఆరు నెలల విరామం తర్వాత బంగ్లాదేశ్‌తో రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌కు సిద్ధమవుతున్న భారత జట్టు ఈ మేరకు సన్నాహకాలు మొదలుపెట్టింది. చెన్నైలోని చిదంబరం స్టేడియం వేదికగా ఈనెల 19 నుంచి జరుగబోయే తొలి టెస్టు కోసం ఇది వరకే నగరానికి చేరుకున్న టీమ్‌ఇండియా.. శుక్రవారం తొలి ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొంది. జట్టు సభ్యులంతా గురువారం నాటికే ఇక్కడికి చేరగా శుక్రవారం ఉదయం కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి టీమ్‌తో కలిశారు. గత నెలలో హెడ్‌కోచ్ బాధ్యతలు చేపట్టిన గౌతం గంభీర్‌తో పాటు అతడి కోచింగ్ బృందం అభిషేక్ నాయర్(అసిస్టెంట్ కోచ్), బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్‌కు స్వదేశంలో ఇదే తొలి సిరీస్. గంభీర్ బృందం పర్యవేక్షణలో ఆటగాళ్లంతా ఉత్సాహంగా ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను బీసీసీఐ తన సోషల్ మీడియా ఖాతాలలో పంచుకుంది.

దులీప్ ట్రోఫీ తొలి దశ పోటీలు ముగిసిన తర్వాతే చెన్నైకి చేరుకున్న కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్, వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్, తదితర ఆటగాళ్లు మైదానంలో కొంతసేపు ప్రాక్టీస్ చేశారు. టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత కొంతకాలం పాటు విరామం తీసుకున్న జస్‌ప్రీత్ బుమ్రా నెట్స్‌లో చెమటోడ్చాడు. అతడితో పాటు సిరాజ్, తొలిసారి టెస్టు జట్టుకు ఎంపికైన యశ్ దయాల్ సైతం బౌలింగ్ ప్రాక్టీస్ చేశాడు. తొలి టెస్టుకు ఎంపికైనా ఇంకా జట్టుతో చేరని యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్.. దులీప్ ట్రోఫీ రెండో దశ మ్యాచ్‌లు ముగియగానే చెన్నైకి రానున్నాడు.

**విరాట్ ఆగమనం**

ఆగస్టులో శ్రీలంకతో మూడు వన్డేల సిరీస్ ఆడిన అనంతరం కుటుంబంతో కలిసి ఇంగ్లండ్‌లో గడుపుతున్న విరాట్ కోహ్లి స్వల్ప విరామం తర్వాత స్వదేశానికి చేరుకున్నాడు. శుక్రవారం ఉదయమే చెన్నైకి చేరుకున్న కోహ్లి.. విమానాశ్రయం నుంచి నేరుగా టీమ్‌హోటల్‌కు చేరుకున్నాడు. అనంతరం జట్టుతో కలిసిన అతడు.. 45 నిమిషాల పాటు నెట్స్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేసినట్టు బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఏడాది జనవరిలో దక్షిణాఫ్రికాతో కేప్‌టౌన్ టెస్టు ఆడిన తర్వాత మళ్లీ రెడ్‌బాల్ క్రికెట్ ఆడనుండటం కోహ్లికి ఇదే మొదటిసారి. స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌కు వ్యక్తిగత కారణాలతో అతడు దూరంగా ఉన్న విషయం విదితమే.

## డబ్ల్యూటీసీ ఫైనల్ నుంచి ఆస్ట్రేలియా ఔట్



ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ కోసం కసరత్తులు ఇప్పటికే మొదలయ్యాయి. పాయింట్ల పట్టికలో తమ స్థానాన్ని పటిష్టం చేసుకునే పనిలో అన్ని జట్లూ బిజీగా ఉన్నాయి.ప్రస్తుతం భారత్, ఆస్ట్రేలియాలు పాయింట్ల పట్టికలో టాప్-2 స్థానాలను ఆక్రమించాయి. డబ్ల్యూటీసీ ఫైనల్ ఈరెండు జట్ల మధ్య మరోసారి టైటిల్ పోరు కనిపించవచ్చని అభిమానులు ఆశిస్తున్నారు. అయితే, పాయింట్ల పట్టికలో వేరే నంబర్ల గేమ్ జరుగుతోంది. ఆస్ట్రేలియా ముందు ఓ జట్టు అడ్డుగా నిలుస్తోంది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ కూడా డబ్ల్యూటీసీ ఫైనల్ సమీకరణాన్ని పంచుకుంది. పాయింట్ల పట్టికలో టీమ్ ఇండియా అగ్రస్థానంలో ఉంది. సెప్టెంబరు 19 నుంచి బంగ్లాదేశ్‌తో భారత జట్టు స్వదేశంలో 2 టెస్టుల సిరీస్ ఆడాల్సి ఉంది. దీంతో పాయింట్ల పట్టికలో స్థానం మరింత పటిష్టం చేసుకోవచ్చు. %ఔజ% ఫైనల్ చేరే రేసులో భారత్‌కే అత్యధిక అవకాశాలు ఉన్నాయి. బంగ్లాదేశ్ తర్వాత భారత్ కూడా న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌లు ఆడాల్సి ఉంది. ఆస్ట్రేలియా టూర్‌లో 5 టెస్టుల్లో కనీసం 3 టెస్టుల్లో భారత్ గెలిస్తే ఫైనల్స్‌లో చోటు ఖాయం చేసుకోవచ్చు. టీమ్ ఇండియా మొత్తం 10 టెస్టుల్లో గెలిస్తే ఆ జట్టు పాయింట్ల శాతం 85.09 అవుతుంది. ఆస్ట్రేలియా టూర్‌తో పాటు సొంతగడ్డపై జరిగే 5 టెస్టుల్లోనూ భారత్ గెలిస్తే పాయింట్ల శాతం 79.76కి చేరుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం టీమ్ ఇండియాకు ఫైనల్ చేరే మార్గం సులభమైంది. గత 10 ఏళ్లుగా బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని ఆస్ట్రేలియా చేజిక్కించుకోలేకపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ఈసారి కూడా ఈ జట్టుకు పెద్ద సవాల్‌గా మారనుంది. ఆస్ట్రేలియా జట్టు భారత్‌పై 5 టెస్టులు, శ్రీలంకతో స్వదేశంలో 2 టెస్టులు గెలిస్తే, అది గరిష్టంగా 76.32 శాతం పాయింట్లను స్కోర్ చేస్తుంది. ఇది ఫైనల్‌కు మంచిది. అయితే, ఆస్ట్రేలి యా ముందు న్యూజిలాండ్ జట్టు అడ్డంకిగా మారుతు న్నట్లు కనిపిస్తోంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ట్రోఫీని భారత్ నుంచి న్యూజిలాండ్ జట్టు కైవసం చేసుకుంది. ఈసారి కూడా ఆస్ట్రేలియా కంటే ఈ జట్టుకే ఫైనల్స్‌కు చేరే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కివీస్ జట్టు భారత్‌తో 3, శ్రీలంకతో 2 టెస్టులు ఆడాల్సి ఉంది. ఆ తర్వాత స్వదేశంలో ఇంగ్లండ్‌తో 3 టెస్టుల సిరీస్ కూడా జరగనుంది. ఈ జట్టుకు ఇంకా 8 మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ప్రస్తు తం న్యూజిలాండ్ 50 శాతం పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. అయితే, అన్ని మ్యాచ్‌ల్లో విజయం సాధిస్తే ఈ జట్టు 78.57 పాయింట్లు పొందే అవకాశం ఉంది.

## బంతి పడకుండానే ఆఫ్ఘనిస్తాన్, న్యూజిలాండ్ టెస్టు మ్యాచ్ రద్దు




గ్రేటర్ నోయిడా వేదికగా ఆఫ్ఘనిస్తాన్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరగాల్సిన ఏకైక టెస్టు వర్షం కారణంగా రద్దయ్యింది. పిచ్ చిత్తడిగా ఉండటంతో ఆట సాధ్యపడకపోగా.. చివరి మూడు రోజులు వర్షం వల్ల మ్యాచ్ జరగలేదు. దాంతో, ఇరు జట్ల కెప్టెన్లు ఫోటో షూట్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. శుక్రవారం(సెప్టెంబర్ 13) ఉదయం నోయిడాలో భారీ వర్షం కురవడంతో ఐదో రోజు ఆట సాధ్యపడలేదు. దాంతో, అంపైర్లు మ్యాచ్ రద్దు అయినట్లు ప్రకటించారు. కనీసం ఈ మ్యాచ్ టాస్ కూడా వేయకపోవడం గమనార్హం. టెస్టు క్రికెట్ చరిత్రలో ఇలా ఒక్క బంతి పడకుండా మ్యాచ్ రద్దు చేయడం ఇది ఎనిమిదోసారి కాగా.. భారత గడ్డపై తొలిసారి. 1933 నుంచి భారత్ టెస్టులకు ఆతిథ్యం ఇస్తోంది. రద్దయిన ఆఫ్ఘనిస్తాన్- న్యూజిలాండ్ రికార్డుల్లోకెక్కింది. భారత గడ్డపై ఒక టెస్టు మ్యాచ్ బంతి కూడా వేయకుండా రద్దు చేయడం 91 ఏళ్ల భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఇదే తొలిసారి. ఆసియాలో ఇంతకు ముందు 1998లో ఫైసలాబాద్ వేదికగా పాకిస్థాన్- జింబాబ్వే మధ్య జరిగిన టెస్ట్ ఒక్క బంతి వేయకుండానే రద్దయ్యింది.

బంతి వేయకుండానే రద్దయిన టెస్ట్ మ్యాచ్‌లు

**1890:** ఇంగ్లాండ్ - ఆస్ట్రేలియా (మాంచెస్టర్)
**1938:** ఇంగ్లాండ్ - ఆస్ట్రేలియా (మాంచెస్టర్)
**1970:** ఆస్ట్రేలియా - ఇంగ్లాండ్ (మెల్‌బోర్న్)
**1989:** న్యూజిలాండ్ - పాకిస్థాన్ (డునెడిన్)
**1990:** వెస్టిండీస్ - ఇంగ్లాండ్, (జార్జిటౌన్)
**1998:** పాకిస్తాన్ - జింబాబ్వే (ఫైసలాబాద్)
**1998:** న్యూజిలాండ్ - ఇండియా (డునెడిన్)
**2024:** ఆఫ్ఘనిస్తాన్ - న్యూజిలాండ్, గ్రేటర్ నోయిడా(ఇండియా)

మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక




## బుట్ట బొమ్మకు ఎట్టకేలకు ఒక బిగ్ ఛాన్స్

టాలీవుడ్ లో గత సంవత్సరం వరకు బిజీ హీరోయిన్ గా వరుస సినిమాలు చేసిన ముద్దుగుమ్మ పూజా హెగ్డే. అల్లు అర్జున్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొంది వచ్చిన అల వైకుంఠపురంలో సినిమా లో నటించిన భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. రికార్డ్ బ్రేకింగ్ వసూళ్లు నమోదు చేసిన ఆ సినిమా తర్వాత వెంటనే మహేష్ బాబుకు జోడీగా గుంటూరు కారం సినిమాలో నటించే అవకాశం ను పూజా హెగ్డే దక్కించుకున్నా, ఆ తర్వాత కొన్ని కారణాల వల్ల సినిమా నుంచి ఆమె తప్పుకోవాల్సి వచ్చింది. బాలీవుడ్ లోనూ ఈమెకు నిరాశే మిగిలిన విషయం తెల్సిందే. తెలుగు లో సినిమా ఆఫర్లు తగ్గిన సమయంలో తెలివిగా తమిళ్, హిందీ భాషల్లో ఈ అమ్మడు సినిమాలు చేసేందుకు సిద్ధం అయింది. లక్కీగా కొన్ని హిందీ సినిమాల్లో ఆఫర్లు వచ్చినా అవి బాక్సాఫీస్ వద్ద బొక్క బోర్లా పడ్డాయి. అయినా కూడా ఏమాత్రం తగ్గకుండా సినిమాల కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉంది. ఆకట్టుకునే అందం తో పాటు, నటిగా మంచి మార్కులు దక్కించుకున్న పూజా హెగ్డే కి గత ఏడాది కాలంగా ఒక్క సినిమాలోనూ ఛాన్స్ రాలేదు. వచ్చిన గుంటూరు కారం కూడా చేజారడంతో పూజా హెగ్డే కెరీర్ ఖతం అంటూ అంతా భావించారు. ఇలాంటి సమయంలో సూపర్ స్టార్ సినిమాలో ఛాన్స్ దక్కింది. కోలీవుడ్ సూపర్ స్టార్ విజయ్ ఇప్పటికే రాజకీయ పార్టీని ప్రకటించడం జరిగింది. ఆ పార్టీకి సంబంధించిన బ్యాక్ గ్రౌండ్ వర్క్ జరుగుతోంది. ది గోట్ సినిమాతో విజయ్ సినిమాలకు గుడ్ బై చెప్పేసి పూర్తి స్థాయిలో రాజకీయాలు చేయాలని భావించాడు. కానీ ముందే కమిట్ అయిన సినిమా అవ్వడంతో హెచ్ వినోద్ దర్శకత్వంలో విజయ్ నటించాల్సిన పరిస్థితి వచ్చింది. 50 నుంచి 60 రోజుల్లో సినిమా పూర్తి అయ్యే విధంగా దర్శకుడు హెచ్ వినోద్ ప్లాన్ చేస్తున్నట్లుగా సమాచారం అందుతోంది. ఈ ఏడాది చివరి వరకు షూటింగ్ పూర్తి చేసి వచ్చే ఏడాది సమ్మర్ లో సినిమాను విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు.

## కరణ్ సలహాతో ..తెలుగులోకి జాన్వీ ఎంట్రీ

శ్రీదేవి కుమార్తెగా ఇండస్ట్రీకి వచ్చిన జాన్వీకపూర్ వైవిధ్యమైన కథలు ఎంచుకుంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. బాలీవుడ్‌లో వరుస సినిమాలు చేస్తూనే టాలీవుడ్‌లో స్టార్ హీరోల సరసన అవకాశాలు అందుకున్నారు. అయితే ఈ అమ్మడు టాలీవుడ్‌కు ఎంట్రీ ఇవ్వడం వెనక ఓ స్టార్ దర్శకనిర్మాత ఉన్నట్లు తెలుస్తోంది. బాలీవుడ్‌లో ఎంతో మంది నటీనటులు వారి కెరీర్ గురించి కరణ్ జోహార్ సలహాలు తీసుకుంటూ ఉంటారని టాక్. అలానే జాన్వీకి కూడా కరణ్ ఓ సూచన చేశారట. బీటౌన్‌లో తొలి అవకాశం అందుకున్న తర్వాత జాన్వీ తమిళ, తెలుగులో ఛాన్స్‌లు వచ్చాయని దీంతో ఆమె కోలీవుడ్.. టాలీవుడ్‌లలో దేన్ని ఎంచుకోవాలో కరణ్‌ను సలహా కోరినట్లు సమాచారం. ఎన్టీఆర్ సినిమాతో టాలీవుడ్‌కు ఎంట్రీ ఇస్తే తెలుగులో మంచి ఛాన్స్‌లు వస్తాయని కరణ్ ఆమెతో చెప్పారట. దీంతో జాన్వీ వెంటనే 'దేవర'ను ఓకే చేసేశారు. కరణ్ సలహా ఈ భామకు కలిసొచ్చినట్లే ఇక్కడ స్టార్ హీరో సినిమాల్లో అవకాశాలు అందుకుంటున్నారు. ఎన్టీఆర్‌తో సినిమా చేస్తుండగానే మెగా హీరో రామ్ చరణ్ సరసన ఛాన్స్ కొట్టేశారు. నానితో కూడా ఓ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తల వస్తున్నాయి. బీటౌన్‌లో జాన్వీ ఇప్పటి వరకు చిన్న హీరోల సినిమాల్లోనే నటించారు. కానీ, తెలుగులో మాత్రం తొలి సినిమానే ఎన్టీఆర్‌తో ఆడిపాడనున్నారు. బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్స్‌కు పోటీ ఇవ్వలేని జాన్వీ.. ఇక్కడ మాత్రం టాప్ లిస్ట్ హీరోయిన్స్‌కు గట్టిపోటీ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'దేవర'లో ఇప్పటి వరకు రిలీజైన పాటల్లో జాన్వీ అందానికి, డ్యాన్స్‌కు ఆడియన్స్ ఫిదా అవుతున్నారు. తాజాగా రిలీజైన 'దావుదీ..' సాంగ్‌లో ఎన్టీఆర్‌తో సమానంగా డ్యాన్స్ వేసిందని ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. దీంతో ఈ సినిమా విడుదలయ్యాక జాన్వీ మరిన్ని అవకాశాలు అందుకోవడం ఖాయమని వారు భావిస్తున్నారు.





## సమంత బ్యూటీకి..ఆ స్టైల్ కి కుర్రాళ్లంతా ఫిదా!

సమంత స్టైలిష్ డిజైనర్ దుస్తుల్లో కనిపించడం రేర్. ఫోటో షూట్లు ఉంటే? తప్ప స్టైలిష్ ఎంపికల జోలికి వెళ్లదు. కానీ తనలో అంతకు మించిన ఫ్యాషన్ క్వాలిటీని మాత్రం ప్రతీ సందర్భంలో హైలైట్ చేస్తుంటుం ది. అందులో తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపును చూపుతుంది. సాధారణ దుస్తుల్లోనే తనలో ఫ్యాషన్ క్వాలిటీని హైలైట్ చేయడంలో సామ్ ప్రత్యేకం. తాజాగా అమ్మడి ఎయిర్ పోర్టు లుక్ ఒకటి లీకైంది. ఇందులో అమ్మడు బ్లాక్ అండ్ జీన్స్ కాంబినేషన్ లో ఎంతో అందంగా కనిపిస్తుంది. మెష్ నెక్‌లైన్‌తో కూడిన పొరలుగా ఉన్న పొడవాటి నల్లని కార్డిగాన్‌ని టాప్ గా ఎంచుకుంది. దానికి మ్యాచింగ్ గా బ్లూ జీన్స్‌తో జత చేసింది. కళ్లకు బ్లాక్ సన్ గ్లాసెస్ ధరించింది. ఇందులో అమ్మడు ఎంతో స్టైలిష్ గాను కనిపిస్తుంది. ట్రెండీగానూ హైలైట్ అవుతుంది. ఇలాంటి దుస్తులు ప్రయాణల సమయంలో ఎంతో సౌకర్యవంతంగా ఉంటాయి. ఎయిర్ పోర్ట్ నుంచి వస్తోన్న సమయంలో సమంత ఎంతో బిజీగా కనిపిస్తుంది. ఫోన్ కాల్ మాట్లాడుతూ హడావుడిగా నడుచుకుంటూ వస్తోంది. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతుంది. సాధారణ దుస్తుల్లోనే సమంత ఇంత అందంగా ఉందంటే? డిజైనర్ దుస్తుల్లో తనలో బ్యూటీ ని మాటల్లో వర్ణించగలమా. సమంత అభిమానులు తమ అభిమానాన్ని కామెంట్ల రూపంలో చాటుతున్నారు. ఇక సమంత కెరీర్ ని మళ్లీ బిజీగా మార్చే పనిలో ఉంది. త్వరలోనే %-%సీటాడెల్%-% ఇండియన్ వెర్షన్ తో ప్రేక్షకుల ముందుకు రానుంది. దీన్ని ఇండియాలో అన్ని చోట్లా పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని ప్లాన్ చేస్తున్నారు. దీనిలో భాగంగా సమంత ముంబైలోనే ఉంటుంది. అలాగే కొత్త ప్రాజెక్ట్ ల విషయంలోనూ హడావుడిగా ఉంది.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com